PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 243 | విజయవాడ, గురువారం 6 ఏప్రిల్ 2023 | 6+8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 6 April 2023 | Rs





బుధవారం ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో జరిగిన చారిత్రాత్మక ర్యాలీకి హాజరైన అశేష జనవాహిని (ఇన్‌సెట్‌లో అభివాదం చేస్తున్న సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుఎ నేతలు తపన్ సేన్, బి వెంకట్, విజూకృష్ణన్, హేమలత, అశోక్ ధావలే, విజయరాఘవన్, ప్రఖ్యాత ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్)

మోడీ గద్దె దిగు!

- గర్జించిన కార్మిక, కర్షక లోకం
- దేశ నలుమూలల నుంచి దండుగా కదలి వచ్చిన కష్టజీవులు
- కిక్కిరిసిన రాజధాని వీధులు
- ఎర్ర సంద్రాన్ని తలపించిన రామ్‌లీలా మైదానం
- ఎంఎస్‌పి, జాతీయ ఉపాధి హామీ కోసం రాజీ లేని పోరు
- లేబర్‌కోడ్‌లను రద్దు చేయాల్సిందే
- చారిత్రాత్మక మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ పిలుపు

వార్తలు 5,6లో

మోడీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై దేశ ప్రజానీకం కన్నెర్ర చేసింది. ఈ ముదనష్టపు కార్పొరేట్- మతతత్వ విధానాలపై నిరసన తెలిపేందుకు అటు కాశ్మీరం నుంచి కన్యాకుమారి వరకు, ఇటు గౌహతి నుంచి గుజరాత్ వరకు ఇలా దేశ నలుమూలల నుంచి పెద్దయెత్తున తరలివచ్చిన కార్మికులు,కర్షకులు, వ్యవసాయ కార్మికులతో ఢిల్లీ వీధులు బుధవారం ఉదయానికే ఎరుపెక్కాయి. ర్యాలీకి వేదికగా నిలిచిన రామ్‌లీలా మైదానం ఎర్ర సంద్రాన్ని తలపించింది. భుజాలపై ఎర్ర జెండా, నెత్తిన టోపీలు ధరించి మండుటెండలో కదం తొక్కుతూ, 'ఇంక్విలాబ్ జిందాబాద్- మోదానీ ప్రభుత్వం డౌన్ డౌన్' , దేశ్‌కి బచావో-మోడీ కా హటావో ' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని గ్యారెంటీ చేస్తూ చట్టం తేవాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతు వ్యతిరేక విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, జాతీయ ఉపాధి హామీ కింద మరిన్ని పనులు కల్పించాలని హిందీ, ఇంగ్లీష్, తెలుగు, తమిళ తదితర ప్రాంతీయ భాషల్లో ముక్త కంఠంతో నినదించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం మధ్య తమ జీవనోపాధిపై నిరంతరం జరుగుతున్న దాడులపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్పొరేట్-కమ్యూనల్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపితేనే దేశానికి రక్ష అని ఆలిడింయా కిసాన్ సభ (ఎఐకెఎస్), సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), ఆలిండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ (ఎఐఎడబ్ల్యుయు) కలసి సంయుక్తంగా నిర్వహించిన ఈ చారిత్రాత్మక ర్యాలీ ఉద్ఘాటించింది. కష్టజీవుల బతుకులు మెరుగుదలకు ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాలే మార్గమని స్పష్టం చేసింది.

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

సామాజిక న్యాయ పోరాట యోధుడు

బాబూ జగ్జీవన్‌రామ్

గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్, సిఎం జగన్ నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గవర్నరు మాట్లా డుతూ.. జగ్జీవన్‌రామ్ సమర్థుడైన పరిపాలనాధ్యక్షులు, ప్రతిభా వంతుడైన వక్త అని ఆయన సేవలను కొనియాడారు. పేదలు, అణగారిన వర్గాల కోసం పాటుపడ్డారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప సంస్కరణవాది : సిఎం

బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప సంస్కరణవాది అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున, ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, చీఫ్ సెక్రటరీ కెఎస్ జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమనీయం కోదండరాముని కల్యాణం

- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి

లోపలి పేజీలో..

పోలవరం నిర్వాసితులను ముంచొద్దు

- పరిహారం ఇవ్వకపోతే ప్రతిఘటన తప్పదని సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశం హెచ్చరిక
- హాజరైన పలు పార్టీల నాయకులు
- పునరావాసం పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం నిర్వాసితులకు తగు పరిహారం చెల్లించకుండా వారిని గోదావరి వరదల్లో ముంచేయాలని చూస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని సిపిఎం ఆహ్వానంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం హెచ్చరించింది. ముందు నిర్వాసితులకు న్యాయం చేసిన తరువాతే ప్రాజెక్టును పూర్తి చేయాలనీ కోరింది. పోలవరం నిర్వాసితులకు పనరావాసం కల్పించాలని కోరుతూ బుధవారం విజయవాడ బాలోత్సవ భవన్లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టిడిపి, కాంగ్రెస్‌తోపాటు పలు వామపక్ష పార్టీల నాయకులు హాజరయ్యారు.

ప్రభుత్వాలు సిగ్గుతో తలదించుకోవాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

గోదావరికి వరదలు వచ్చిన సమయంలో ఎనిమిది మండలాల్లో గిరిజనులను ముంచి చెట్టు పుట్టలపాలు చేశారని, కనీసం వసతి చూపించలేని ప్రభుత్వాలు సిగ్గుతో తలదించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన అయన మాట్లాడుతూ ప్రాజెక్టు ఎంత ముఖ్యమో పునరావాసం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పోలవరం 79 శాతం పూర్తయిందని చెబుతున్నారని, వాస్తవంగా అయింది 22 శాతమేనని తెలిపారు. గత ప్రభుత్వం పునరావాసం కింద కుటుంబానికి రూ.6.50 లక్షలు ప్రకటిస్తే జగన్ రూ.10 లక్షలు ఇస్తానని చెప్పారని, నాలుగేళ్ల పూర్తవుతున్నా పట్టించుకోలేదని అన్నారు. నాలుగు చోట్ల పునరావాస కాలనీలు కడితే వాటిల్లో రెండు కాలనీలు వరదలకు మునిగిపోయాయని వివరించారు. కాంటూరు లెక్కలు కూడా అర్థం పర్థం లేని తప్పుడు లెక్కలన్నారు. గోదావరి వరద వచ్చిన సమయంలో వారు చెప్పిన దానికంటే ఎక్కువగా గ్రామాలు, ఇళ్లు మునిగిపోయాయయని పూర్తి అనాలోచితంగా కాంటూరు లెక్కలు వేశారని పేర్కొన్నారు. పాలక పార్టీలు కూడా పోలవరం అనగానే డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాం అంటున్నారు తప్ప అక్కడ ముంపునకు గురవుతున్న ప్రజలను పట్టించుకోవడం లేదని తెలిపారు. జాతీయ ప్రాజెక్టుగా

మిగతా 2లో



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

పనితీరు ఆధారంగానే టికెట్లు

టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో చంద్రబాబు

ప్రజాశక్తి- భీమునిపట్నం, విశాఖ

పనితీరు ఆధారంగానే 2024 ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. నిత్యం ప్రజలతోనే నాయకులు, కార్యకర్తలు ఉండాలన్నారు. లేకుంటే మిమ్మల్ని ప్రజలు మర్చిపోతారంటూ హితబోధ చేశారు. విశాఖ నగరంలోని పిఎం.పాలెం లోగల వి.కన్వెన్షన్ హాలులో బుధవారం జరిగిన టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. టిడిపి తలపెట్టిన రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూనే, జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను రచ్చబండపై ఉతికి ఆరేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ ఉక్కు సంకల్పంతో పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో టిడిపిదే విజయమన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు పడకేశాయని, సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తి కాలేదని విమర్శించారు. టిడిపి అధికారంలోకొచ్చాక సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేస్తామని, వంశధార, నాగావళి నదుల అనుసంధానానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాడుగుల, చోడవరం, పెందుర్తి మండలాల్లోని రైతులకు రైవాడ రిజర్వాయర్ నీటిని అందిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వ తన అసమర్థపాలనతో పోలవరం ప్రాజెక్టును గోదావరిలో ముంచేసిందని ధ్వజమెత్తారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో విశాఖ ఉక్కు ప్రయివేట్‌పరం కాకుండా కాపాడుకోగలిగామని గుర్తు చేశారు. ప్రశాంతతకు మారుపేరైన విశాఖ నేడు గంజాయి, గన్ కల్చర్‌కు కేంద్ర బిందువుగా మారిందని విమర్శించారు. గత నాలుగేళ్ల పాలనలో విశాఖలోని రూ.40 వేల కోట్ల విలువైన ప్రభుత్వ, ప్రజల ఆస్తులను సిఎం జగన్, ఆయన అనుచరులు దోచుకున్నారని ఆరోపించారు. కార్తీక వనం, ప్రేమ సమాజం ఆస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. చివరకు రైతు బజార్లను, రెవెన్యూ స్థలాలను సైతం తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ధరలన్నీ పెరిగాయన్నారు. గత నాలుగేళ్లలో ఏడుసార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచారని, ఆర్‌టిసి ఛార్జీలు, వంట గ్యాస్ ధరలు పెరిగాయని తెలిపారు. ఆస్తి పన్ను పెంచారని, చివరకు చెత్తపై కూడా పన్ను విధించిన చెత్త ప్రభుత్వం ఇది అంటూ విమర్శించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

మరో నిఘా సాఫ్ట్‌వేర్

- పెగాసస్ ప్రత్యామ్నాయ సంస్థ నుంచి కేంద్రం కొనుగోలు
- 'ద హిందూ' డేటా విశ్లేషణలో వెల్లడి

లోపలి పేజీలో..

జాతీయ భద్రత సాకు మాత్రమే!

- ఆ పేరుతో పౌర హక్కులు నిరాకరిస్తున్నారు
- మీడియా వన్‌పై నిషేదం చెల్లదు
- కేంద్రానికి సుప్రీం మొట్టికాయలు

టెన్త్ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో

బండి సంజయ్ అరెస్ట్

- కరీంనగర్ జైలుకు తరలింపు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సంచలనం రేపిన పదో తరగతి హిందీ ప్రశ్నా పత్రం లీకేజీ కేసులో తెలంగాణ బిజెపి అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు బూర ప్రశాంత్ ఇచ్చిన సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి కరీంనగర్‌లోని బండి సంజయ్ నివాసంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రశ్నా పత్రాల లీకు నిందితులతో తరచుగా ఫోన్ సంభాషణ, మెసేజ్‌లపై సంజయ్‌ను ప్రశ్నించిన వరంగల్ పోలీసులు ఆ తర్వాత అరెస్ట్ చేశారు. బండి సంజయ్‌ను ఎ-1 నిందితుడిగా పేర్కొంటూ 120 బి, 420, 447, 505 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో హన్మకొండ ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ జస్టిస్ అనిత రాపోలు ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. బండి సంజయ్‌ను పోలీసులు కరీంనగర్ జైలుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం... ప్రశ్నా పత్రం లీకేజీ కేసులో బండి సంజయ్ ఎ1, బూరా ప్రశాంత్ ఎ2, గుండబోయిన మహేశ్ ఎ3, మైనర్ బాలుడు ఎ4, శివగణేశ్ ఎ5 నిందితులుగా ఉన్నారు. కమలాపూర్ ప్రభుత్వ పాఠశాల నుంచే ప్రశ్నాపత్రం బయటకు తెచ్చినట్టు దర్యాప్తులో తేలింది. బండి సంజయ్‌కు వాట్సప్‌లో మంగళవారం ఉదయం 11.20 గంటలకు బూర ప్రశాంత్ హిందీ ప్రశ్నా పత్రాన్ని పంపాడు. బండి సంజయ్‌తో ప్రశాంత్ పలుమార్లు వాట్సప్ కాల్ మాట్లాడాడు. బండి సంజయ్ ఫోన్ విశ్లేషిస్తే కీలక సమాచారం తెలియనుందని, అయితే, ఆయన ఫోన్ ఇవ్వట్లేదని చెప్పారు. సంజయ్ అరెస్టుపై లోక్‌సభ స్పీకర్‌కు సమాచారం ఇచ్చామని, ఎక్కడా నిబంధనలు అతిక్రమించలేదని సిపి తెలిపారు.



బతికుండగానే చంపేస్తున్నారు

- కన్నీటి పర్యంతమైన పోలవరం నిర్వాసితులు
- వైద్యం అందక చనిపోతున్నారు
- శ్మశానం లేక ఇంట్లోనే పూడ్చుకునే స్థితికి వెళ్లిపోయాం
- మరణాలను బయటకు రానీయలేదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ముంపు ప్రాంతాల్లో గిరిజనులకు పునరావాసం కల్పించకుండా వరదల్లో ముంచి చంపేస్తున్నారని, ఎక్కడ ఉండాలో తెలియని స్థితిలో నెలల తరబడి గుట్టలపై గుడారాలు వేసుకుని వెదురు దుంపలు తింటూ కాలం వెళ్లదీశామని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ. చనిపోతే ఆ విషయాన్ని బయట ప్రపంచానికి తెలియనీయకుండా ఈ ప్రభుత్వాలు చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన బుధవారం విజయవాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశానికి వేర్వేరు గ్రామాల నుంచి బాధితులు వచ్చారు. వారందరూ తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఊరిలో 60 ఇళ్లు ఉంటే 20 ఇళ్లకు పరిహారం ఇచ్చి వెళ్లిపోమన్నారని, మిగిలిన వారందరూ ఏమైపోవాలని వారు ప్రశ్నించారు. తమకు న్యాయం చేయకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

సర్వేల పేరుతో తీవ్ర అన్యాయం
సీసం సురేష్, నిర్వాసితుడు



ముంపు ప్రాంతంలోని నాలుగు మండలాల ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. 2006 నుంచి ఇప్పటి వరకూ పునరావాసం, అభివృద్ధి విషయంలోనూ తీవ్రంగా వెనుకబడి ఉన్నాం. 2022లో వరదలు వచ్చిన తరువాత ఆదివాసీలు అతలాకుతలం అయ్యారు. ప్రభుత్వం రోడ్లు, ఫోన్లు కూడా లేకుండా చేసింది. అవకాశం ఉన్న కొండ ప్రాంతాలకు వెళ్లి బతుకు సాగించారు. రెండు, మూడు నెలలపాటు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నాం. మొదటి దశలో ఉన్న విఆర్‌పురం, వేలేరుపాడు, కూనవరం మండలాల్లో పునరావాసం ఇప్పటికీ పూర్తికాలేదు.

ఒక్క ఊరికీ పునరావాసం కల్పించలేదు
పాయా సీతారామయ్య



కూనవరం మండల పరిధిలో నిర్వాసితుడు

2022లో వచ్చిన వరదల్లో ఎక్కువ ఇళ్లు కూలిపోయాయి. బాధితులకు పరిహారం కూడా ఇవ్వలేదు. నిత్యావసర వస్తువులూ దొరకడం లేదు. వైద్యం అందడం లేదు. ప్రతిఏడాదీ ఇదే తరహా ఇబ్బందులు పడుతున్నాం. కూనవరం మండలంలో 2016లో భద్రాయిగూడెం గ్రామానికి కట్టిన పునరావాస కాలనీ ఎనిమిదేళ్లయినా పూర్తి కాలేదు. 170 కుటుంబాలుంటే 100 ఇళ్లు వరదలకు మునిగిపోయాయి. ఒక్క గ్రామానికీ పునరావాసం ఇవ్వలేని ప్రభుత్వం 48 గ్రామాలకు కల్పిస్తుందా? అనే భయం ఉంది. న్యాయం చేయకపోతే పోరాటం చేస్తాం.

చంటి పిల్లలతో బతుకులీడ్చాం
రమేష్, పోలవరం మండల నిర్వాసితుడు



వరదల సమయంలో రెండు, మూడు నెలలు కొండల మీదే ఉన్నాం. వర్షాలు పడటంతో చంటి పిల్లలతో ముడుచుకుని పడుకోవాల్సిన దుస్థితి వచ్చింది. పేరంటాళ్లపల్లి, టేకుపల్లి గ్రామాల్లో ప్రభుత్వ అధికారి కూడా పర్యటించలేదు. తిండిలేక వెదురు పిలకలు, అడవి దుంపలు తిని బతికాం. జబ్బులున్న వారు చాలా మంది చనిపోయారు. అధికారులు బయటకు రానీయలేదు. ఒక్క గ్రామానికి కూడా పరిహారం చెల్లించలేదు. 100 కుటుంబాలుంటే కొద్దిమందికి ఇచ్చి మిగిలిన వారిని కూడా వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారు. ఇచ్చిన పునరావాస కాలనీలో సదుపాయాలు లేవు. అనారోగ్యంతో చనిపోతే కాల్చడానికి పూడ్చడానికి చోటులేక ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో 30 ఇళ్లు కాలిపోతే తక్షణ సాయంగా వెయ్యి రూపాయలు కూడా ప్రభుత్వాలు ఇవ్వలేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి. పునరావాసులను దేవుళ్లని వర్ణిస్తున్నవారు కనీసం మనుషులుగా కూడా చూడటం లేదు. వేలేరుపాడు పిహెచ్‌సి పూర్తిగా మునిగిపోయింది. ముంపులో ఉందని డబ్బులు పెట్టినా ఉపయోగం లేదని చెప్పారు. బాధితులకు పరిహారం ఇవ్వాలంటే ముంపులో లేరని బెదిరిస్తున్నారు.

అధార్ కార్డు చూపిస్తే మంచినీళ్ల ప్యాకెట్ ఇచ్చారు
నిర్వాసితుల సంఘం నాయకులు నాగేంద్రరావు



అధార్ కార్డు చూపిస్తే వాటర్ ప్యాకెట్ ఇచ్చారు. నిర్వాసితులు ఎంత దయనీయంగా ఉన్నారో దీన్ని బట్టి అర్థం అవుతుంది. చంద్రబాబు సిఎంగా ఉండగా.. ప్రాజెక్టుకు వస్తుంటే ముందురోజే అరెస్టు చేసి జైల్లో పెట్టారు. పరిహారం పేరుతో వేరే ప్రాంతాల్లో అప్పటికే గిరిజనుల ఆధీనంలో ఉన్న భూమిని పునరావాసులకు ఇచ్చారు. దీంతో ఘర్షణలు పడాల్సి వచ్చింది. కుక్కునూరు మండలంలో రూ.200 కోట్ల భూ కుంభకోణం జరిగింది. రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాల్లో గెలిస్తే ఎంత గెలవకపోతే ఎంత అనే ఆలోచనతో ప్రభుత్వాలు ఉన్నాయి. కమ్యూనిస్టులు లేకపోతే అక్కడ చూసే నాథుడే లేరు. భద్రాచలంలో 72 అడుగులు వరద వస్తే పోలవరం వద్ద 36 అడుగులకు వచ్చింది. అప్పటికే అన్ని మండలాలూ మునిగిపోయాయి. 85 గ్రామాలుంటే 71 గ్రామాలు మునిగాయి. ఏ పద్ధతిలో అంచనాలు వేశారో సమాధానం చెప్పాలి.

పరిహారం పేరుతో రాళ్ల గుట్టల భూమి ఇచ్చారు
పూనెం ప్రదీప్‌కుమార్, విఆర్‌పురం ఎంపిటిసి



పరిహారం పేరుతో రాళ్ల గుట్టల భూమి ఇచ్చారు. అధికారులు కూడా ఆ భూములు ఎలా ఇచ్చారో ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఇచ్చే భూమి వ్యవసాయానికి ఆమోదయోగ్యంగా ఉందా? లేదా అని కూడా చూడలేదు. కొన్ని గ్రామాల్లో ఇప్పుడు గ్రామసభలు పెట్టి నిర్వాసితులను గుర్తిస్తున్నారు. ఇప్పుడు ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదు.

కనీస సదుపాయాలు లేవు
కారెం భాస్కర్, గిరిజన సంఘం నాయకులు

పునరావాస కాలనీల్లో 670 ఇళ్లు కట్టి ఒక వాటర్ ట్యాంకు కట్టారు. డ్రెయినేజీలు, రోడ్డు, స్కూళ్లు, పిహెచ్‌సిలు లేవు. తరలించేనాటికి అన్ని సౌకర్యాలు కల్పించాలని చెబుతున్నా ఆ పని చేయడం లేదు. తరలించిన వారికి పునరావాస ప్రాంతంలో చేసుకోవడానికి పనిలేక తక్కువ కూలికి పోతున్నారు. నిర్వాసితులు చనిపోతే పూడ్చేందుకు కూడా స్థలం లేదు. శ్మశాన వాటిక ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. వెళ్లేందుకూ దారి కూడా లేదు. గ్రామస్తులు అంగీకరించలేదు. నిర్వాసితులను త్యాగధనులుగా కీర్తిస్తున్న పాలక పార్టీల నాయకులు వారికి న్యాయం మాత్రం చేయడం లేదు.

వైద్యం అందక కళ్లముందే చనిపోతున్నారు
కాకా అర్జునదొర, ఎటపాక



న్యాయం చేయాలని అడిగిన వారిని పాలక పార్టీలు అరెస్టులు చేయిస్తున్నాయి. పట్టిసీమలో కాలువకు రూ.30 లక్షల నుంచి రూ.52 లక్షలు ఇచ్చారు. ఏజెన్సీలో ఎందుకు ఇవ్వడం లేదు. పరిహారం ఇచ్చేనాటికి చట్టం ఎందుకు అడ్డు వస్తుందో క్లారిటీ ఇవ్వాలి. వరదలు తగ్గిన తరువాత రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి కారు నుంచి కిందకు కూడా దిగలేదు. పాము కరిస్తే ఆస్పత్రికి వెళ్లలేక కొందరు చనిపోయారు. నందిగామలో ఆడకూతురు ఆస్పత్రికి వెళ్లలేక అబార్షన్ అయ్యింది. బాధితులు బాధతో అడుగుతారని, ప్రభుత్వాలు ఆలోచించి రానున్న కాలంలో ఇలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలి. చిన్నపాటి వరదలకు కూడా గ్రామాలు పూర్తిగా మునిగిపోతున్నాయి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు చేయడం లేదు. సిపిఎం ఒక్కటే బాధితుల తరపున మాట్లాడుతోంది.

పోరాటాన్ని ఉధృతం చేయాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారంనాటికి 783వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికులు కూర్చున్నారు. దీక్షనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, వరసాల శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహన్‌కుమార్, ఎన్.బాలభాస్కరరావు, డేవిడ్, మాట్లాడుతూ.. గత వారం ఢిల్లీలో ప్రధాన రాజకీయ పార్టీల పార్లమెంట్ ఉభయ సభలకు సంబంధించిన ఫ్లోర్ లీడర్లను కలిసి విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యను విన్నవించామని తెలిపారు. మన రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలన్నీ నరేంద్ర మోడీకి బి టీమ్‌గా మారాయని విమర్శించారు. వామపక్ష భావజాలం ఉన్న పార్టీలు మినహా అందరూ మోడీ ప్రాపకం కోసం వెంపర్లాడుతుండడంతో బిజెపి విధానాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అధికార, విపక్ష పార్టీల నేతలెవరూ ప్రజల ఆకాంక్షలు, సమస్యల పరిష్కారం పట్ల పోరాటం చేయడంలో పెద్దన్న పాత్ర పోషించేందుకు ముందుకు రాకపోవడం దురదష్టకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెవి.సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, డిసిఆర్‌సి.మూర్తి, జె.వెంకటేశ్వరరావు, కె.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు దిక్సూచి జగ్జీవన్‌రామ్

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడుగు, బలహీన వర్గాలకు దిక్సూచి, దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం, సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యాన విజయవాడ తుమ్మళపల్లి కళాక్షేత్రంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి పదవులను సమర్ధవంతంగా నిర్వహించడమే కాకుండా ఆయన పదవీ కాలంలో విప్లవాత్మక చర్యలకు నాంది పలికారన్నారు. జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయరు రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్ : చంద్రబాబు

సమతావాది, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. కుల రహిత సమాజం కోసం తన జీవితాంతం కృషి చేసిన ఆదర్శ నాయకుడు అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్మరించుకుందామని చంద్రబాబు ట్విట్టర్ ద్వారా తెలిపారు. దళిత జాతి అభ్యున్నతికి పోరాడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

వైసిపి కేంద్ర కార్యాలయంలో..

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జూపూడి ప్రభాకరరావు, జంగా కృష్ణమూర్తి, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


టిడిపి కార్యాలయంలో..

టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మాజీ మంత్రులు నక్కా ఆనంద్ బాబు, కెఎస్ జవహర్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అందని 'జాదూ' పరిహారం

- ఉత్తర్వులు ఇవ్వడంలో కమిషనర్ తాత్సారం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి



గత ఏడాది కావేరీ జాదూ కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన పత్తి రైతులకు నేటికీ పరిహారం అందలేదు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లోని 1,889 మంది రైతులు 7,258 ఎకరాల్లో జాదూ కల్తీ విత్తనాలను సాగు చేసి నష్టపోయారు. సాధారణంగా ఒక ఎకరా సాగుకు రూ.50 వేల నుంచి రూ.60వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరాకు 12 నుంచి 13 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉండగా ఈ కల్తీ విత్తనాల వల్ల ఒక క్వింటా మాత్రమే దిగుబడి వచ్చింది. రైతు సంఘం పోరాటాల ఫలితంగా కల్తీ విత్తనాల వ్యవహారంపై నంద్యాల శాస్త్రవేత్తలు పలు ప్రాంతాల్లో పర్యటించి నమూనాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. 50 నుంచి 70 శాతం నకిలీ విత్తనాలు ఉండటం వల్లే పంట దిగుబడి తక్కువ వచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వ కమిటీ రైతులతో చర్చించి ఎకరాకు రూ.23,370 పరిహారాన్ని అవార్డు ప్రకటించింది. కర్నూలు జిల్లాలో మొత్తం రూ.16.96 కోట్లు పరిహారాన్ని కావేరీ జాదు కంపెనీ చెల్లించాల్సి ఉంది. పరిహారం నుంచి తప్పించుకునేందుకు జనవరి 29న హైకోర్టును ఆశ్రయించింది. ఈ అంశాన్ని వ్యవసాయ శాఖ కమిషనర్ దగ్గర తేల్చుకోవాలని కేసును హైకోర్టు సస్పెండ్ చేసింది. రైతులకు జాదూ కంపెనీ పరిహారం చెల్లించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఆ ఉత్తర్వులు ఇవ్వడంలో జాప్యం ప్రదర్శిస్తున్నారు.

పరిహారం అందించాలి



జాప్యం లేకుండా రైతులకు పరిహారం అందించేలా చూడాలి. కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడంలో జాప్యం ప్రదర్శిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఆందోళనలు, రాస్తారోకో చేపట్టాం. ఆందోళనను కొనసాగిస్తాం.

జి.రామకృష్ణ,
రైతు సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.



రంజాన్, గుడ్‌ఫ్రైడేకు సెలవులే

- ఎపిటిఎఫ్‌తో మంత్రి బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రంజాన్, గుడ్‌ఫ్రైడే పండగలకు సెలవులుంటాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారని ఎపిటిఎఫ్ వెల్లడించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, చిరంజీవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పాఠశాలలకు సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. వీటికి పరిహారంగా ఏప్రిల్ 30లోపు ఆరు రోజులు పనిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మధ్యలో గుడ్‌ఫ్రైడే, ఈస్టర్, రంజాన్ పండగలు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పరిహారం దినాలు తక్కువైనా ఫర్వాలేదని, పండగ రోజులను సెలవు దినాలుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

టిడిపి అధికారంలోకి వస్తే వాలంటీర్లను తొలగించం

- పనికి తగ్గ వేతనమిచ్చి గౌరవిస్తాం
- మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, కెఎస్ జవహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధికారంలోకి వచ్చినా వాలంటీర్లను తొలగించదని మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, కెఎస్ జవహర్ తెలిపారు. పనికి తగిన వేతనమిచ్చి వారి గౌరవాన్ని పెంచుతామని వెల్లడించారు. టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం ఇరువురూ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాలంటీర్లతో జగన్ వెట్టిచాకిరీ కంటే ఘోరమైన పనులు చేయిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగేతర శక్తిగా మారుస్తూ తన కుట్రలకు వాడుకుంటున్నారని తెలిపారు. జగన్ చెప్పే అర్ధసత్యాలు, అసత్యాలను గోబెల్స్ మాదిరి విషప్రచారం చేయొద్దని వాలంటీర్లను కోరారు. జగనన్నే తమ నమ్మకం అని వాలంటీర్లు ప్రజలకు ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. స్వచ్ఛందంగా సేవ చేస్తున్నది వాలంటీర్లు అని, జగన్‌ను ఎందుకు నమ్మాలని ప్రశ్నించారు. జగన్ చేసిన అప్పులు రూ.6,75,273 కోట్లు అని, అందులో ప్రజల కోసం పెట్టిన ఖర్చు రూ.2,96,148 కోట్లు అని తెలిపారు. మిగిలిన రూ.4 లక్షల కోట్లు ఎటుపోయాయని ప్రశ్నించారు.

ఉద్యమాన్ని కొనసాగిస్తాం

- సమస్యలపై కొందరు మంత్రులకు అవగాహన లేదు
- వేతనాలు ఏ తేదీన వేస్తారో ప్రకటించాలి
- ఎపిజెఎసి అమరావతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘంలో కొందరు మంత్రులకు ఉద్యోగుల సమస్యలపై కనీస అవగాహన లేదని ఎపిజెఎసి అమరావతి విమర్శించింది. ఒకటో తేదీనే వేతనాలు పొందే ఉద్యోగులకు ప్రస్తుతం ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొంది.

ప్రతినెలా ఏ తేదీన జీతం వేస్తారో ఖచ్చితంగా చెప్పాలని డిమాండ్ చేసింది. ఉద్యమం ఈ నెల 29 వరకూ కొనసాగుతుందని తెలిపింది. విజయవాడలో ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. అనంతరం సమావేశ వివరాలను ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డు ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. అందుకే తమ పోరాటానికి ఉద్యోగుల నుంచి పెద్దఎత్తున మద్దతు వస్తోందన్నారు. నల్ల బ్యాడ్జీల నిరసన కార్యక్రమాలను ఈ నెల 29 వరకూ కొనసాగిస్తామన్నారు. ఈ నెల 8న నల్ల కండువాలతో ముఖ్యమైన కేంద్రాల్లో పోస్టర్లు ఆవిష్కరిస్తామన్నారు. 10న అన్ని జిల్లాల కలెక్టర్లకు స్పందనలో నల్లటి మాస్కులు ధరించి వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. ఈ నెల 11న సెల్‌ఫోన్ డౌన్ కార్యక్రమం ఉంటుందన్నారు. 12, 18 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో ఈ నెల 25న ధర్నా ఉంటుందని తెలిపారు. 15న రిటైర్డు ఉద్యోగులు, మృతిచెందిన ఉద్యోగుల ఇంటికెళ్లి పరామర్శించడం చేస్తామన్నారు. వేతనాలు ఆలస్యమవుతున్నందున అన్ని బ్యాంకులకూ వెళ్లి చర్చలు జరుపుతామన్నారు. 27న పెన్షన్‌లు రాని వారి ఇళ్లను సందర్శిస్తామని పేర్కొన్నారు. 29న కలెక్టరేట్ల ఎదుట గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ఉద్యోగుల సమస్యలపై ధర్నాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు టివి ఫణిరాజు, వివి మురళీకృష్ణం నాయుడు, కృష్ణమోహన్, వసంతరాయులు, కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పాఠ్యపుస్తకాల పంపిణీ

- పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే విద్యా సంవత్సరం నాటికి సకాలంలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తామని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. పాఠ్యపుస్తకాల ముద్రణకు అవసరమైన పేపర్ కోసం తమిళనాడు న్యూస్ ప్రింట్ అండ్ పేపర్స్ లిమిటెడ్‌తో రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఒప్పందం చేసుకుంది.

ఈ అంశంపై ఆ సంస్థ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ సాయికుమార్‌తో ప్రవీణ్ ప్రకాష్ బుధవారం తమిళనాడులో చర్చించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాల ముద్రణ కోసం 15,711 మెట్రిక్ టన్నుల పేపర్ అవసరం కాగా, ఇప్పటి వరకు 5,918 మెట్రిక్ టన్నుల పేపర్ సరఫరా చేశారు. ఏప్రిల్ 30వ తేదీలోపు మరో 4 వేల మెట్రిక్ టన్నులు, మే 10వ తేదీ నాటికి మిగిలిన పేపర్‌ను సరఫరా చేస్తామని సిఎండి ప్రవీణ్‌కు వివరించారు. విద్యాసంవత్సరం ప్రారంభ సమయానికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రవీణ్ తెలిపారు.

కోన రఘుపతిని సస్పెండ్ చేయాలి : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులను కించపరిచేలా మాట్లాడిన వైసిపి ఎమ్మెల్యే కోన రఘుపతిని వైసిపి నుంచి సస్పెండ్ చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాపట్ల పార్లమెంటు స్థానాన్ని ఎస్‌సిలకు కేటాయించడం చారిత్రాత్మక తప్పిదం అని ఎలా అంటారని ప్రశ్నించారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. 2024లో దళితుల ఆగ్రహావేశాలకు వైసిపి నాయకులు గురికాక తప్పదని హెచ్చరించారు. దళితులపై కోనకు ఏమాత్రం గౌరవం ఉంటే తక్షణమే భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

పోలవరంపై ప్రజల్ని మోసగిస్తున్న ప్రభుత్వం

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడంలో ప్రజలను వైసిపి ప్రభుత్వం మోసం చేస్తోందని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదన్నారు. కేవలం రాజకీయంగా బురద జల్లేందుకు ప్రాజెక్టు అంశాన్ని వాడుకుంటున్నారనే విషయం కేంద్ర మంత్రి షెకావత్‌తో భేటీ సందర్భంగా తెలిసి అవాక్కయ్యామన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలో పవన్‌కల్యాణ్ పోలవరంలో పర్యటిస్తారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచకాలు, రాజ్యాంగ ఉల్లంఘనలు, శాంతి భద్రతలు క్షీణించడం వంటి విషయాలను బిజెపి పెద్దల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం వారు కూడా కలిసి నడుస్తారనే నమ్మకం ఉందని అన్నారు. టిడిపితో కలిసే అంశం చర్చకు వచ్చిందా? అని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. రాజకీయ అంశాలు చర్చకు రావడం సహజమేనన్నారు.

పోలవరం నిర్వాసితులను ముంచొద్దు

మొదటి పేజీ తరువాయి

ప్రకటించిన తరువాత పునరావాసానికి రూ.29 వేల కోట్లు ఖర్చవుతుంటే రూ.2 వేల కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్న కేంద్రాన్ని ఎవరూ ప్రశ్నించడం లేదని ఆగ్రహం వ్యకం చేశారు. గిరిజనులకు రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు 1/70, పీసా అమలవుతాయని, దాని ప్రకారం వారికి న్యాయం జరగాల్సి ఉందని, అవేమీ పట్టించుకోలేదని అన్నారు. గిరిజనుల పట్ల వివక్షాపూరిత వైఖరిని అనుసరిస్తున్నారని, దీన్ని పూర్తిగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

నిధులివ్వకుండా కేంద్రం బుకాయింపు
మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రాజెక్టుకు కేంద్రం ఇచ్చిన హామీని విస్మరించి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా బుకాయిస్తోందని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. బాధ్యతలు నిర్వర్తించకపోగా తీరని ద్రోహం చేసిందని వివరించారు. ప్రాజెక్టు కట్టే సమయంలో ఎంత మునుగుతుందనే అంచనా కూడా ఉండాలని ఆచరణలో అదేమీ కనిపించడం లేదని తెలిపారు. ప్రాజెక్టులో పునర్నిర్మాణం, పునరావాసం కీలకమని పేర్కొన్నారు. అరుణ్‌జైట్లీ ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజీలో ఇరిగేషన్ కాంపోనెంట్ అని పేర్కొన్నారని, దానిపై అప్పటి చంద్రబాబు కూడా స్పష్టత తీసుకోకపోడంతో తీరని అన్యాయం జరిగిందని వివరించారు. ప్రాజెక్టులో ఇరిగేషన్ కాంపోనెంట్ అని ప్రత్యేకంగా ఏమీ ఉండదని, కానీ కేంద్రం అదేమాట పట్టుకుని పునరావాసం అనే ప్రస్తావన లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు.

గిరిజనులు ప్రజలనే విషయాన్ని ప్రభుత్వాలు మరిచాయి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

నిర్వాసితులు ఇప్పటికీ వరదలు వస్తే గుట్టలపైకి పోయి తలదాచుకుంటున్నారని అన్నారు. రూ.45 వేల కోట్లు పెడితే మొత్తం ప్రాజెక్టు పూర్తయిపోతుందని, ఏడాదికి రూ.15 వేల కోట్ల చొప్పున మూడు సంవత్సరాలు ఇస్తే ప్రాజెక్టు పూర్తయిపోతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపిలెవరూ పోలవరం ప్రాజెక్టు, పునరావాసం గురించి మాట్లాడటం లేదని, ప్రధానికి వినతిపత్రం ఇవ్వడానికి కూడా ధైర్యం చేయలేనిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో కాంట్రాక్టర్లను మార్చారని విమర్శించారు. ఈ విషయంలో కేంద్రం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు.

గిరిజనులకు న్యాయం చేస్తాం
మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

ప్రాజెక్టు పూర్తి కోసం తెలుగుదేశం పార్టీ కేంద్రం చుట్టూ తిరిగిందని, అయినా ఎన్నో ఆంక్షలు పెట్టి నానా ఇబ్బందులు సృష్టించిందని మాజీ మంత్రి, తెలుగుదేశం నాయకులు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. నాలుగు గ్రామాల్లో గిరిజనులు ఆందోళనలు చేస్తుంటే కొంత పరిహారం పెంచి వారిని ఖాళీ చేయించామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే గిరిజనులకు న్యాయం చేస్తామని చెప్పారు.

నిర్వాసితులకు తీవ్ర అన్యాయం

పోలవరం నిర్వాసితుల విషయంలో నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో అందరూ పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు అంటే కాంక్రీటు నిర్మాణం మాత్రమే కాదని, అందులో ఉన్న గిరిజనులు, ప్రజలు అనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మరిచాయని విమర్శించారు. కాఫర్ డ్యాం పూర్తి కాకుండానే చిన్నపాటి వరదలకే నిర్వాసితుల ఇళ్లు మునిగిపోయాయని, ఈ విషయంలో వారికి తీవ్ర అన్యాయం జరిగిందని ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ అన్నారు. కేంద్రం పునరావాస ప్యాకేజీ ఇవ్వనంటోందని, ఒకవేళ అదే జరిగితే రాష్ట్ర ప్రభుత్వాలు ఏమి చేస్తాయో చెప్పాలని కోరారు. రాష్ట్రంలో పాలన సరిగా లేదని వివరించారు.

చట్టసభలోనూ తప్పుడు సమాచారం

పోలవరం విషయంలో ప్రభుత్వం చట్టసభలోనూ తప్పుడు సమాచారం ఇస్తోందని తెలిపారు. వరదలు వచ్చిన సమయంలో స్వయంగా పర్యటించామని, ఆ సమయంలో ఎక్కువమంది గిరిజనులు గుట్టలపై టెంట్లు వేసుకుని జీవించారని, కరెంటు, పాలు, మంచినీళ్లు కూడా లేవని గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేయకుండానే ప్రాజెక్టు 76 శాతం పూర్తయిందని చెప్పడం మోసమని తెలిపారు. పాలకులు గిరిజనులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

అడవి బిడ్డల ఆక్రందనను ఎవరూ పట్టించుకోవడం లేదని, కాంటూర్ పేరుతో చెప్పే లెక్కలన్నీ దొంగలెక్కలని గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ సాబ్జి పేర్కొన్నారు. దీనిపై 14 సార్లు సర్వే జరిపినా ఇంకా ఎంతవరకు మునుగుతుందో చెప్పలేకపోవడమంటే గిరిజనులను నిర్ధాక్షిణ్యంగా తరిమేయాలనే కుట్ర కనిపిస్తోందని పేర్కొన్నారు. పోలవరం వద్ద 26 అడుగుల ఎత్తు వరద వచ్చినప్పుడే ఆయా ప్రాంతలన్నీ మునిగిపోయి ఇళ్లన్నీ కూలిపోయాయయని ఇది చూసైనా కాంటూరును నిర్ధారించలేనిస్థితిలో ప్రభుత్వాలు ఉండటం తీరని ద్రోహమని పేర్కొన్నారు.

కేంద్రం మెడలు వంచాలి

కేంద్రం అన్ని విషయాల్లోనూ అన్యాయం చేస్తోందని, పోలవరం విషయంలో మరీ నిరంకుశంగా వ్యవహరిస్తోందని న్యూడెమోక్రసీ నాయకులు పొలారి చెప్పారు. దీనికి వ్యతిరేకంగా పోరాడాలని, కేంద్రం మెడలు వంచాలని అన్నారు.

జాతీయ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం నెత్తిన పెట్టుకోవడం సరైంది కాదని అన్నారు. రాష్ట్రంలో కేంద్రాన్ని ప్రశ్నించే విషయంలో వైసిపి, టిడిపి వైఫల్యం చెందాయని సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్ అన్నారు. నిర్వాసితుల పట్ల కేంద్రం అప్రకటిత ఎమర్జెన్సీ ప్రకటించినట్లు ఉందని వివరించారు.

ప్రభుత్వం బాధితులకు ఇచ్చే డబ్బులు వరదల అనంతరం ఇళ్లలో నిండిన బురదను తీసుకునేందుకు కూడా సరిపోవడం లేదని ఎంసిపిఐ నాయకులు ఖాదర్ భాషా పేర్కొన్నారు ఎస్‌యుసిఐ నాయకులు సుధీర్ బాబు మాట్లాడుతూ ముంపు ప్రాంత ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో, ఇప్పుడు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప నిర్వాసితులకు న్యాయం చేయడం లేదని తెలిపారు.

పునరావాసం పేరుతో ఆయా గ్రామాల్లో పెత్తందారులు డబ్బు కాజేశారని, అటువంటి వారికి న్యాయం చేయాలని ఎంఎల్ పార్టీ నాయకులు వీరబాబు కోరారు. రైతు నాయకులు మరీదు ప్రసాదుబాబు మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ముంపు ప్రాంతాల్లో గిరిజనులు చెట్టుకొకరు, పుట్టకొకరు వెళ్లిపోయారని అన్నారు. కుటుంబాల్లో సభ్యులు కూడా బతకలేక వేర్వేరు ప్రాంతాల్లో బతుకులీడుస్తున్నారని అన్నారు. రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నాయకులు జానకిరాములు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు జరిగిన అన్యాయాన్ని నిలదీయాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని అన్నారు. డెల్టా రైతు నాయకులు ఎర్నేని నాగేంద్రనాథ్ మాట్లాడుతూ పునరావాసం తరువాతే ఎక్కడైనా ప్రాజెక్టులు కడతారని, పోలవరం విషయంలో మాత్రం పునరావాసం ప్రస్తావన లేకుండా ప్రాజెక్టు కడుతున్నారని అన్నారు. వామపక్ష నాయకులు వెంకటరెడ్డి మాట్లాడుతూ పోలవరం గిరిజనులకు జరిగిన అన్యాయం మరెక్కడా జరగలేదని, వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా రైతు నాయకులు రంగారావు మాట్లాడుతూ 800 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాజెక్టులకు నీళ్లిస్తామని చెబుతున్న నాయకులు దానికి మూలమైన గిరిజనులను ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పోలవరం సాధన సమితి నాయకులు అక్కినేని భవానీ ప్రసాదు మాట్లాడుతూ పునరావాసం పునర్నిర్మాణం అనే విషయంలో ప్రభుత్వాలకు సరైన కార్యక్రమం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, డెల్టా పోరాట కమిటీ నాయకులు కొలనుకొండ శివాజీ, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భార్యను చంపి ఆపై తానూ ఆత్మహత్య

ప్రజాశక్తి - మడకశిర రూరల్

కుటుంబ కలహాలు, అనుమానం ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. భార్యను హత్య చేసి, ఆపై భర్త కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఎగువరామగిరి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (40) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య రాధమ్మ (35) హిందూపురంలోని ఓ ప్రయివేట గార్మెంట్స్‌లో పని చేస్తోంది. వెంకటేశ్వర్లు తాగుడుకు బానిసవ్వడంతో దంపతుల మధ్య కలహాలు మొదలయ్యాయి. దీనితో తోడు భార్యపై వెంకటేశ్వర్లు అనుమానం పెంచుకున్నాడు. గ్రామంలో జరిగే మారెమ్మ జాతరకు బంధువులను పిలిచే నిమిత్తం తన భార్యను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళ్లాడు. గ్రామ శివారులో భార్యతో ఘర్షణపడ్డాడు. మొహంపై బండరాయితో మోది హత్య చేశాడు. సమీపంలోని ఓ చెట్టుకు వెంకటేశ్వర్లు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వారికి ఓ కుమార్తె ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అంతిమ యాత్రలో పాల్గొన్న వెంకటేష్, రానా


ముగిసిన దగ్గుబాటి మోహన్‌బాబు అంత్యక్రియలు

ప్రజాశక్తి-కారంచేడు (బాపట్ల జిల్లా)

ప్రముఖ సినీ నిర్మాత, దగ్గుబాటి రామానాయుడు సోదరుడు దగ్గుబాటి మోహన్‌బాబు (73) అంత్యక్రియలు బుధవారం బాపట్ల జిల్లా కారంచేడులో ముగిశాయి. సురేష్‌బాబు, వెంకటేష్, దగ్గుబాటి రానా, అక్కినేని నాగచైతన్య, అభిరామ్, సినీ నటుడు కొల్లా అశోక్‌బాబు తదితరులు మోహన్‌బాబుకు అంత్యక్రియలు నిర్వహించారు. సినీ ప్రముఖులు, ఆయన కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమయాత్రకు భారీగా అభిమానులు తరలివచ్చారు.

అమ్మకానికి తిరుపతి ఎయిర్‌పోర్టు

- కొనేందుకు టాటా, జిఎంఆర్, రిలయన్స్ పోటీ
- రిలయన్స్ వైపే కేంద్రం మొగ్గు!
- టెండర్లు పిలువకుండానే కట్టబెట్టేందుకు ప్రయత్నం?
- విమానాశ్రయానికి ఏటా రూ.200 కోట్ల లాభం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఏటా రూ.200 కోట్లపైనే లాభాలు వస్తోన్న తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కేంద్రం అమ్మకానికి పెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, రాజమండ్రి, తిరుపతి ఎయిర్‌పోర్టులను కూడా ప్రయివేటీకరించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి వికెసింగ్ తాజాగా వెల్లడించారు. టెండర్లు పిలవకుండానే తిరుపతి ఎయిర్‌పోర్టును అమ్మేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధమైనట్లు సమాచారం. తిరుమల ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో దేశవిదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారు. కార్గో విమానాలు కూడా నడుస్తున్నాయి. ఈ ఎయిర్‌పోర్టును దక్కించుకునేందుకు జిఎంఆర్, టాటా, రిలయన్స్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ మూడింటిలో రిలయన్స్ సంస్థ వైపే కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఈ ఎయిర్‌పోర్టును కారు చౌకగా దక్కించుకొని దీనిపక్కనే ఉన్న మరో 300 ఎకరాల ప్రభుత్వ భూములను కూడా కొనుగోలు చేసి మాల్స్, రెస్టారెంట్లు, స్టార్ హోటళ్లు నిర్మించే ప్రణాళికలో రిలయన్స్ సంస్థ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తిరుపతి నగరానికి కూతవేటు దూరంలో ఈ విమానాశ్రయం ఉంది. పెద్ద విమానాలు మూడు ఒకేసారి ల్యాండ్ అయ్యేలా స్థాయికి విస్తరణ జరిగింది. దీంతోపాటు డొమెస్టిక్, కార్గో విమానాలు వచ్చి వెళ్లేలా తీర్చిదిద్దారు. సాధారణ పార్కింగ్‌లో 500 కార్లను, వివిఐపి పార్కింగ్‌లో 50 కార్లను పార్కింగ్ చేసే అవకాశం ప్రస్తుతం ఈ విమానాశ్రయంలో ఉంది. పది ఆర్‌టిసి బస్సులను కూడా పార్కింగ్ చేయవచ్చు. తమిళనాడు, బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన కొందరు పారిశ్రామికవేత్తలు, సినీతారల వ్యక్తిగత/ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల ఆదాయం కూడా ఈ ఎయిర్‌పోర్టుకు ఆదాయం సమకూరుతోంది.

డైరెక్టర్ పోస్టు మూడేళ్ల క్రితం రద్దు


గతంలో ఇక్కడ డైరెక్టర్ పోస్టు ఉండేది. ప్రయివేటీకరణ చేయాలనే ఆలోచనతో మూడేళ్ల క్రితం డైరెక్టర్ పోస్టును కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అంతవరకు ఉన్న డైరెక్టర్‌ను ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు బదిలీ చేసింది. ప్రస్తుతం జనరల్ మేనేజర్ పర్యవేక్షణలో ఈ ఎయిర్‌పోర్టు ఉంది. నిర్వహణ మొత్తం తమిళనాడులోని తిరుచ్చి ఎయిర్‌పోర్టు ఆధ్వర్యంలో నడుస్తోంది. 300 మంది ఉద్యోగులు, 200 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులు, 150 మంది రక్షణ సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీ, విశాఖపట్నం, విజయవాడ, చెన్నయ్, బెంగళూరు, మైసూరు, హైదరాబాద్‌ల నుంచి రోజుకు 15 విమానాలు వచ్చి వెళ్తున్నాయి. అందులో ఇండిగో ఐదు, ఎయిరిండియా నాలుగు, స్పైస్‌జెట్ ఐదు, ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఒకటి ఉన్నాయి. సిబ్బంది జీతభత్యాలు, నిర్వహణ మొత్తం ఖర్చులుపోను గత ఐదేళ్లగా ఏటా సుమారు రూ.200 కోట్లు లాభాలు వస్తున్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 6,23,341 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. 8,150 ట్రిప్పులు విమానాలు తిరిగాయి. ఖర్చులుపోను రూ.202 కోట్లు ఆ ఏడాది ఆదాయం సమకూరింది. మొత్తం ప్రయాణికుల నిష్పత్తి 76.9 శాతంగా (ఆక్యుపెన్సీ) ఉంది. 83 కార్గో విమానాలు పంటల ఉత్పత్తులను ఎగుమతి చేశాయి. సాధారణ రోజుల్లో రెండు వేలు, వేసవి నాలుగు నెలల కాలంలో మూడు వేలకు ప్రయాణికుల సంఖ్య చేరుకుంది. తాజాగా అంతర్జాతీయ విమానాలు తీసుకురావాలని ఎంపి గురుమూర్తి ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో కువైట్ నుంచి తిరుపతికి విమానాలు నడుపుతామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన రెండు రోజులకే కేంద్రమంత్రి వికె సింగ్ తిరుపతి ఎయిర్‌పోర్టు అమ్మకానికి పెట్టడం చర్చనీయాంశమైంది.

కమనీయం కోదండరాముని కల్యాణం

- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ఒంటిమిట్ట

నవ్యాంధ్ర భద్రాద్రి ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లా, రాష్ట్ర నలుమూలల నుంచి యాత్రికులు తరలివచ్చారు. అంతకు ముందు సీతారాముల వారిని ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వేదపండితులు ప్రత్యేక పూజలను నిర్వహించి ఎదుర్కోలు కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రభుత్వం తరుపున గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం శ్రీరాముల కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణ వేదిక వద్ద యాత్రికులను ఆకట్టుకునేలా సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ, మంత్రి రోజా, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఇఒ ఎవి.ధర్మారెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట, రాయచోటి ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కడప జిల్లా కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్, టిటిడి పాలక మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



హంద్రీనీవా పనులేమయ్యాయి..?

- యువగళం పాదయాత్రలో లోకేష్ ప్రశ్న

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా పనులను పూర్తి చేస్తామని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రశ్నించారు. యువగళం పేరుతో లోకేశ్ చేపట్టిన పాదయాత్ర బుధవారం అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో సాగింది. అనంతపురం నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాలు నుంచి ప్రారంభమైన పాదయాత్ర గొట్కూరు, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం క్రాస్, కమ్మూరు క్రాస్ మీదుగా కుడేరు చేరుకుంది. కుడేరులో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతామని జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనలు మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఉరవకొండ నియోజకవర్గంలో 80 వేల ఎకరాలకు సాగునీరందిస్తామన్న హామీ ఏమైందని సిఎంను ప్రశ్నించారు. 50 వేల ఎకరాలకు సామూహిక బిందు, తుంపెర సేద్యం ద్వారా రూ.800 కోట్లతో టిడిపి హయాంలో చేపట్టిన ప్రాజెక్టును ఈ ప్రభుత్వం అట్టకెక్కించిందని విమర్శించారు. పంటకు పురుగు మందు కొడితే చనిపోవడం లేదుగాని, జగన్మోహన్‌రెడ్డి అమ్మే మద్యం మందు కొడితే చనిపోతున్నాయని ఎద్దేవా చేశారు. దళితులపై దాడికి పాల్పడిన వారిలో ఇంత వరకు ఒక్కరికీ శిక్ష పడలేదని విమర్శించారు. డ్రైవరును హత్య చేసిన కేసులో ఎమ్మెల్సీకి శిక్ష పడకపోగా, ఘనస్వాగతం లభించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ పయ్యావుల కేశవ్, అనంతపురం టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్'పై కెటిఆర్‌కున్న చొరవ జగన్‌కు లేదు

ప్రొటెక్షన్ ఫర్ స్కాలర్‌షిప్ హోల్డర్స్ రాష్ట్ర అధ్యక్షులు డి.సువర్ణ రాజు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ, విశాఖ



విశాఖ స్టీల్‌ప్లాంట్ పట్ల భారత్ రాష్ట్ర సమితి కార్యనిర్వహక అధ్యక్షుడు కెటిఆర్ తీసుకున్నంత చొరవ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చూపించకపోవడం సిగ్గుచేటని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ అండ్ న్యాయ కళాశాల విద్యార్థి సంఘం పూర్వ అధ్యక్షులు, ప్రొటెక్షన్ ఫర్ స్కాలర్‌షిప్ హోల్డర్స్ రాష్ట్ర అధ్యక్షులు డి.సువర్ణరాజు అన్నారు. 'విశాఖ ఉక్కు - తెలుగువారి హక్కు'గా నినదించాలని, ఈ పరిశ్రమను కాపాడుకోవడం కోసం తెలుగువారంతా కలిసి పోరాడాలని కెటిఆర్ పిలుపునిచ్చారని తెలిపారు. అంతేకాకుండా విశాఖ ఉక్కుకు రూ.5 వేల కోట్లు కేటాయించి, ప్రభుత్వరంగంలోనే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్రానికి బహిరంగలేఖ కూడా రాశారన్నారు.0 ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు కృషి చేయాలని సువర్ణరాజు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకాన్ని నిరసిస్తూ సువర్ణరాజు ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (136/2021) దాఖలు చేసి ఉన్నత న్యాయస్థానంలో పోరాటం చేస్తున్నారు. ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం గత రెండేళ్ల నుంచి రాష్ట్రమంతటా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు.

వైసిపి ప్రభుత్వ విధానాలపై పోరాటం: సోము వీర్రాజు


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి, జనసేన కలిసి పోరాటం చేస్తాయని, వైసిపి ప్రభుత్వాన్ని పడగొట్టే వరకూ కలిసి ఉద్యమిస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు తెలిపారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబుతో పవన్‌కల్యాణే కాదు.. తను కూడా వివిధ సందర్భాల్లో భేటీ అయ్యానని, ఇందులో ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. చంద్రబాబును కలిసినంత మాత్రాన పొత్తులో ఉన్నారంటే ఎలా? అని ప్రశ్నించారు. తెలంగాణ బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు సోము వీర్రాజు పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ కుట్రలకు బిజెపి భయపడదన్నారు.

మరో నిఘా సాఫ్ట్‌వేర్

- పెగాసస్ ప్రత్యామ్నాయ సంస్థ నుంచి కేంద్రం కొనుగోలు
- 'ద హిందూ' డేటా విశ్లేషణలో వెల్లడి

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ నిఘా పరికరాల అమ్ముల పొదిలో మరో కొత్త అస్త్రం చేరింది. వివాదస్పద పెగాసస్ సాఫ్ట్‌వేర్‌కు ప్రత్యామ్నాయంగా పేరొందిన కాగ్నైట్ సాఫ్ట్‌వేర్ లిమిటెడ్ సంస్థ నుంచి భారత రక్షణ సంస్థ నిఘా పరికరాలు కొనుగోలు చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. కేంద్రంలోని మోడీ సర్కార్ నిఘా పరికరాల కొనుగోలు అంశంపై నోరు మెదపకుండా దాటవేత వైఖరి అవలంబిస్తున్న సంగతి తెలిసిందే. ఇజ్రాయిల్ నుంచి పెగాసస్ కొనుగోలు చేశారా? లేదా అని సర్వోన్నత న్యాయస్థానం నిలదీసినా బిజెపి ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయకుండా నాన్చుతోంది. ఈ దశలో మరో నిఘా సంస్థ నుంచి పరికరాలు కొనుగోలు చేసిన వైనం వెలుగులోకిరావడం విశేషం. కేంద్రం రహస్యంగా ఉంచుతూ వస్తున్న ఈ వివరాలు ప్రముఖ జాతీయ మీడియా సంస్థ 'ద హిందూ' జరిపిన డేటా విశ్లేషణలో బట్టబయలయ్యాయి. కాగ్నైట్ కూడా ఇజ్రాయిల్‌కు చెందిన సంస్థే. ఇది పెగాసస్‌కు పోటీదారుగా ఉంది. పెగాసస్ లాగే అనేక వివాదాలు మూటగట్టుకున్న ఈ సంస్థ అనేక దేశాల్లో కేసులు నడుస్తున్నాయి. అమెరికాలో ఈ కంపెనీపై ఇన్వెస్టర్ల కేసులు కూడా వున్నాయి. "కాగ్నైట్ సాధారణంగా ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టులను, అసమ్మతివాదులను, నిరంకుశ ప్రభుత్వ విమర్శకులను, ప్రతిపక్షాల కుటుంబాలను, మానవ హక్కుల కార్యకర్తలను లక్ష్యంగా పెట్టుకుంటుంది. వారికి తెలియకుండానే, వారి ఫోన్లు, కంప్యూటర్లపై నిఘా పెట్టి, అవసరమైన సమాచారాన్ని సేకరిస్తుందని అమెరికా న్యాయ సంస్థ కెస్లర్ టోపాజ్ మెల్టెజర్ అండ్ చెక్ ఎల్‌ఎల్‌పి పేర్కొంది. "కిరాయికి నిఘా" పరిశ్రమపై ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫారమ్స్ ఇచ్చిన 'త్రెట్ రిపోర్ట్'ను ప్రస్తావించింది. రక్షణ ఇంటెలిజెన్స్ సంస్థ (డిఐఎ) పరిధిలోకి వచ్చే సిగ్నల్ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (ఎస్‌ఐడి)కు మూడేళ్ళుగా కాగ్నైట్, దాని మాతృ సంస్థ వేరియంట్ సిస్టమ్స్ ఇన్‌కార్పొరేషన్‌లు కంప్యూటర్ గేర్‌ను సరఫరా చేస్తున్నాయి. కస్టమ్స్ డేటా ప్రకారం గత కొన్నేళ్ళుగా ఎస్‌ఐడి ఎలాంటి దిగుమతులు చేసుకున్నట్లు లేదు. ఈ ఏడాది జనవరిలోనే ఆ సంస్థ నుండి ఒక ఉత్పత్తి దిగుమతి అయింది. దిగుమతులపై హిందూ అడిగిన ప్రశ్నలకు కాగ్నైట్ స్పందించలేదు. ఎన్‌ఎస్‌ఓ గ్రూపునకు చెందిన పెగాసస్ స్పైవేర్‌కి పోటీగా ప్రత్యర్థి సంస్థల నుండి నిఘా పరికరాలను కొనుగోలు చేసేందుకు భారత ప్రభుత్వం టెండర్లు వేయాలనుకుంటోందని ఇటీవల ఫైనాన్షియల్ టైమ్స్ వ్యాసం పేర్కొంది. అలా భారత ప్రభుత్వం పరిశీలిస్తున్న సంస్థల్లో ఒకటే కాగ్నైట్.



ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో గాంధీ పాఠాలు గల్లంతు

న్యూఢిల్లీ : మహాత్మ గాంధీకి సంబంధించిన పలు పాఠ్యాంశాలను ఎన్‌సిఇఆర్‌టి కొత్త పుస్తకాల్లో తొలగించారు. దీనిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. హిందూ ముస్లిం ఐక్యత కోసం మహాత్మా గాంధీ చేసిన ప్రయత్నాలు మితవాద విభాగమైన ఆర్‌ఎస్‌ఎస్‌కు ఆగ్రహం తెప్పించడం, ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేదం విధించడం వంటి పాఠ్యాంశాలను తొలగించారు.

ఎన్‌సిఇఆర్‌టి కొత్త 12వ తరగతి పాఠ్య పుస్తకాల్లో ఈ భాగాలు తొలగించడంపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతీకారంతోనే మోడీ సర్కార్ ఈ దుశ్చర్యకు పాల్పడుతోందని విమర్శించింది. అయితే ఈ ఏడాది కొత్తగా సిలబస్‌ను కుదించలేదని ఎన్‌సిఇఆర్‌టి చెప్పింది.

తొలగించిన చాప్టర్లు ఏమిటి?

- 'థీమ్స్ ఆఫ్ ఇండియాన్ హిస్టరీ-పార్ట్ 2' నుంచి 'కింగ్స్ అండ్ క్రోనికల్స్ : ది మొఘల్ కోర్ట్స్ (16 మరియు 17వ శతాబ్దాలు)'కు సంబంధించిన చాప్టర్లు.
- 11వ తరగతిలో సెంట్రల్ ఇస్లామిక్ ల్యాండ్స్, సంస్కృతుల ఘర్షణ, పారిశ్రామిక విప్లవం.
- 12వ తరగతి పౌరశాస్త్రం పుస్తకం 'స్వాతంత్ర్యం నుంచి భారత రాజకీయాలు'లో 'రైస్ ఆఫ్ పాపులర్ మూవ్‌మెంట్స్', 'ఎరా ఆఫ్ వన్ పార్టీ డామినెన్స్'.
- పదో తరగతి డెమోక్రాటిక్ పాలిటిక్స్-2 పుస్తకాల నుంచి 'డెమోక్రసీ అండ్ డైవర్సిటీ', 'పాపులర్ స్ట్రగుల్స్ అండ్ మూవ్‌మెంట్', 'ప్రజాస్వామ్యానికి సవాళ్లు'.
- 12వ తరగతి పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకం నుంచి మహాత్మా గాంధీ హత్యానంతరం ఆరెస్సెస్‌పై విధించిన నిషేధానికి సంబంధించిన కొన్ని పేరాలను తొలగించారు. అలాగే, హిందూ-ముస్లిం ఐక్యతకు గాంధీ చేపట్టిన కృషికి సంబంధించిన పేరాలను కూడా తొలగించారు.

ఎయిడెడ్ కారుణ్య నియామకాల జిఓ ఏదీ?: ఎపి టీచర్స్ గిల్డ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎయిడెడ్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల జిఒ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి చిట్టిబాబు, ఎల్‌కె చిన్నప్ప బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తూ.. 2000 నుంచి 2023 వరకు అనేక మంది ఉపాధ్యాయులు మరణించారని తెలిపారు. కరోనా సమయంలో 179 మంది మృతిచెందారని పేర్కొన్నారు. కారుణ్య నియామకాల కోసం చాలా ఏళ్ల నుంచి ప్రభుత్వం, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండటం లేదన్నారు.

సంపాదకీయం

ఆందోళనకర తీర్పు

మూడున్నర దశాబ్దాల క్రితం ఉత్తరప్రదేశ్‌లో మలియానా గ్రామంలో జరిగిన పాశవిక ఊచకోత అప్పట్లో యావత్ దేశానికి భయోత్పాతం కలిగించగా అటువంటి కేసులో నేరారోపణలెదుర్కొంటున్న 40 మంది నిందితులకు స్థానిక న్యాయస్థానం క్లీన్‌చిట్ ఇవ్వడం జాతి మొత్తాన్నీ నివ్వెరపర్చింది. కోర్టుల్లో తమకు న్యాయం జరుగుతుందని 36 ఏళ్లుగా నిరీక్షించిన బాధిత కుటుంబాలకు గుండెకోత మిగిల్చింది. 1987 మే 23న మీరట్ నగర శివార్లలోని మలియానా గ్రామంపై ప్రాంతీయ సాయుధ కానిస్టేబుళ్ల బృందం అర్ధరాత్రి సమయంలో అల్లరి మూకలను వెంబడేసుకొని విచక్షణారహితంగా కాల్పులు జరపగా 72 మంది ముస్లింలు మరణించారు. ఈ మారణకాండ కేసు పోలీస్ దర్యాప్తు, కోర్టు విచారణ నత్తకు నడక నేర్పింది. దాడిలో 93 మంది పాల్గొనగా దశాబ్దాలపాటు విచారణ సాగడంతో చనిపోయినవారు చనిపోగా 40 మంది నేర అభియోగం ఎదుర్కొంటున్నారు. 800 తడవలు కోర్టులో విచారణానంతరం సరైన సాక్ష్యాలు లేవంటూ మధుర జిల్లా కోర్టు నిందితులను వదిలిపెట్టింది. దర్యాప్తు ఏజెన్సీలు, ప్రాసిక్యూషన్ విఫలం కావడం వలన, ఆ రెండు ప్రక్రియలూ ఆలస్యమైనందున బాధితులకు న్యాయం జరగలేదు.

మలియానా హింసాకాండ నేపథ్యాన్ని చూడాలి. వివాదాస్పద బాబ్రీ మసీదు తాళాలు తెరిచాక 1987 మే 17న మీరట్‌లో పెద్ద ఎత్తున మతఘర్షణలు చెలరేగాయి. నగరంలో కర్ఫ్యూ విధించారు. మలియానా దాడి జరగడానికి ఒక్క రోజు ముందు మే 22న మీరట్ శివార్లలోని హషింపురా నుంచి 40 మంది ముస్లింలను ప్రాంతీయ సాయుధ దళం, అల్లరి మూకలతో కలిసి అపహరించి ఢిల్లీ-యు.పి బోర్డర్‌కు తరలించి కిరాతకంగా కాల్చి చంపింది. శవాలను అప్పర్ గంగ కాల్వలో పడేశారు. ఈ కేసు ముప్పై ఏళ్లు నడవగా మొదటి ప్రయత్నంలోనే ప్రాసిక్యూషన్ కేసును రుజువు చేయడంలో వైఫల్యం చెందింది. ట్రయల్‌కోర్టులో సాయుధ దళం తన జనరల్ డైరీని చూపించలేదని తెలియవచ్చింది. ఆ అంశమే 2018లో ఢిల్లీ హైకోర్టు నిందితులపై నేరారోపణలు చేసేందుకు అవకాశం కల్పించింది. మలియానా కేసులోనూ ఎఫ్ఐఆర్ వైఫల్యం కనిపిస్తుంది. ప్రాసిక్యూషన్ అత్యంత లోపభూయిష్టంగా పని చేసిందని మధుర కోర్టు ఎత్తి చూపింది. ప్రాసిక్యూషన్ కోర్టుకు సమర్పించాల్సిన డాక్యుమెంట్లను కనీసం క్రమ పద్ధతిలో పెట్టలేదు. పోస్టుమార్టం రిపోర్టులను ఫోటోకాపీలను అందజేసింది. వాటిని కోర్టు సాక్ష్యాలుగా అంగీకరింపని విధంగా చేసింది. కొందరు నిందితులు సంఘటనకు ముందే చనిపోయారంటూ ఓటర్ల జాబితాలో వారి పేర్లను పోలీసులు మార్చే ప్రయత్నం చేశారని కోర్టు దృష్టికి వచ్చింది. దర్యాప్తు అధికారి క్రాస్ ఎగ్జామినేషన్‌ను పూర్తి చేయలేదు. ఇంత దారుణంగా ఇన్వెస్టిగేషన్, ప్రాసిక్యూషన్ వ్యవస్థలు పని చేసినందునే నేరస్తులు బయటపడ్డారు.

కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చాక మత ఘర్షణల కేసుల్లో నిందితులకు శిక్షలు తక్కువగా పడుతున్నాయి. గడచిన ఐదేళ్లల్లో 30 శాతం లోపే శిక్షలు పడ్డాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక పేర్కొంది. ఢిల్లీలో 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్లుకానీ 2002లో గుజరాత్‌లో గోధ్రా అనంతర మారణహోమంకానీ కేవలం విచారణలు ఆలస్యమైతేనో, దర్యాప్తు వ్యవస్థలు విఫలమైతేనో నిందితులు తప్పించుకున్నారనడం పాక్షిక విశ్లేషణే అవుతుంది. రాజకీయ ప్రభావం, దర్యాప్తు వ్యవస్థల కుమ్మక్కు కేసులు నీరుగారడానికి, న్యాయం ఆలస్యం కావడానికి, బాధితులకు న్యాయం దక్కకపోవడానికి ప్రధాన కారణాలు. పైకోర్టులను ఆశ్రయించి న్యాయం కోసం ప్రయత్నించాలి. గుజరాత్‌లో బిల్కిస్‌బానో కేసులో శిక్షలు పడ్డ నిందితులను సైతం వదిలిపెడుతున్న ప్రభుత్వాలు కేంద్రంలో, కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న వేళ, మలియానా తీర్పు ఆందోళన కలిగిస్తుంది. మత విద్వేషాలు రెచ్చగొడుతున్న ఉన్మాద శక్తులకు ఇంకా భయం లేకుండా పోతుంది. అటువంటి కుట్రలను ప్రజలు అప్రమత్తతతో ఎదుర్కోవాలి.

మహనీయుల మాట

భారత కార్మికోద్యమ నేత బి.టి. రణదివే వర్ధంతి



ప్రస్తుత రాజకీయ ఆర్థిక వ్యవస్థ...కుల, వర్గ దోపిడీని కాపాడే ఆస్తి సంబంధాలపై ఆధారపడి వున్నది. భూస్వాములు, గుత్త పెట్టుబడిదారులు ఆర్థిక వ్యవస్థను అదుపు చేస్తూ...బూర్జువా భూస్వామ్య ప్రభుత్వం అధికారంలో కొనసాగుతున్నప్పుడు...అంటరానితనాన్ని, కులాన్ని నిర్మూలించవచ్చునని చెప్పడం కేవలసం మోసం.

జననం : 19.12.1904 మరణం : 6.4.1990

విశ్లేషణ

రైతాంగ పోరాటాలు - వర్తమానం





అట్టాడ అప్పల్నాయుడు

బాల్యంలో పాఠ్యపుస్తకాలలో రైతు దేశానికి వెన్నెముక, జై జవాన్, జై కిసాన్ అని చదువుతుంటే నా వెన్నుపూస నిటారుగా నిలబడేది, రైతు కొడుకుని అయినందుకు. పుస్తకం మూసేసినాక, వంటపంచకు చేరినా, పంట పొలానికి వెళ్లినా నా తల్లిదండ్రులూ, ఇంటిలోని పెద్దాచిన్నా పిల్లల ఆకలి కడుపులూ, విరుచుకునే ఎముకలూ, కార్చే చెమటలూ కన్పించేవి. ఉన్నత పాఠశాలలో చదువుకున్నపుడు మధ్యాహ్నం భోజనాల కేరేజీలు విప్పినపుడు ఉద్యోగుల పిల్లల కేరేజీల్లోలా కూరలు యెపుడో తప్పా మా రైతు పిల్లల కేరేజీల్లో ఎల్లప్పుడూ పిండొడియమో, ఉల్లిపాయో వుండేవి.

బాల్యంలో నా వెన్నుపూస నిటారుగా నిలబడడానికి కారణమైన నా తండ్రి... చిరిగిన బనీనూ, గావంచాతో, ఎండిన పేగులతో, దిగులు నిండిన కళ్లతో సావుకారి ఇంటి ముందరా, కరణం, నాయుళ్ల కాళ్లకాడ కనబడినపుడూ కారణమేటో తెలిసేది కాదు. వరి, చెరకు, పెసర, మినప, వేరుశనగ, నువ్వులు, కందులు, టమాటా, బీరకాయ, ఆనబకాయ, వంకాయ, మిరపకాయ సమస్త పంటలూ నా తండ్రి కళ్లం నుంచి సావుకారి గోదాముకీ, అక్కడి నుండి యెక్కడెక్కడికో వెళ్లిపోయి మా కంటికి కనిపించేవి కావు, అప్పుడూ ఎరికయ్యేది కాదు. పంటల్ని సరుకుల్ని చేసినోళికి తప్పా నాకే గాదు, నాలాటి నీకూ, అతగానికీ, అందరికీ ఆ మాయ యేటో తెలిసేది కాదు. మనందరికీ కాదు అతగానికి తెలాల! పండించినోడికి తెలాల. పంటలు పోగొట్టుకున్నోడికి తెలాల. తెలస్తాదా... యేనాటికేనా?

తెలిసినందునా..? నేడు ఢిల్లీ చుట్టూరా రైతు దండు జమ అయినాది! అటువంటి దండు ఇప్పుడే కాదు అలనాడు రాజులూ, చక్రవర్తులూ, జమీందారులూ, ఇనాందారులూ, మొఖాసాదారుల నుంచీ తెల్లోళ్ల దాకా సాగిన పాలనల మీద ఇలాగే జమయినాది.

తెల్లదొరలు తెలివయినోళ్లు. జాగీర్దారీ, భూస్వామ్య విధానాన్నీ, రైత్వారీ విధానాన్నీ కలిపి రెండు వ్యవసాయ చట్టాలు తెచ్చి రైతుదండు కళ్లు గప్పినారు. అందుకనే మార్క్స్-బ్రిటిష్ అధికారులు ప్రవేశపెట్టిన వ్యవసాయ చట్టాలు ఒకదానికొకటి విరుద్ధమైనవి. ఒకటి బ్రిటిష్ భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థకు సంబంధిస్తే, మరొకటి ఫ్రెంచి రైతుస్వామ్య వ్యవస్థకు సంబంధించిన నమూనాలు - అన్నాడు. రెండూ రైతులకు గానీ, భూ యజమానులకు గానీ ప్రయోజనకరమైనవి కావు. భూములపై పన్నులు వేసే బ్రిటిష్ ప్రభుత్వానికి ప్రయోజనకరమైనవని కొద్దికాలంలోనే నిరూపణయినాయి. ఇలాంటి రైతు వ్యతిరేక చట్టాలను ఒకవేపు తెచ్చి మరోవేపు భారతీయ సాంప్రదాయ పంటల స్థానంలో ఆంగ్లేయుల పరిశ్రమలకు అవసరమైన పంటలు పండించాలని తీవ్రంగా ఒత్తిడి చేసారు. దేశంలోకి నీలిమందు, పొగాకు పంటలను ప్రవేశపెట్టేరు. కాంట్రాక్టు వ్యవసాయ పద్ధతులను అవలంభించేరు. ఆ పంటలను పండించడానికి అవసరమైన పెట్టుబడులను అప్పుల కింద ఇచ్చేవారు. అప్పుల వడ్డీలు, ధరల యెగుడుదిగుడులతో రైతులు అప్పులపాలవగా భూములు గుంజుకునేవారు. పందొమ్మిదో శతాబ్దిలో జరిగిన అనేక రైతాంగ పోరాటాల నేపథ్యమిదే! ఈ దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ తిరుగుబాటులవి! 1855లో సంతాల్ రైతుల తిరుగుబాటు, 1860లో నీలిమందు తోటల (ఆంగ్లేయ) యజమానుల నిర్బంధ సాగు విధానాలకు వ్యతిరేకంగా బెంగాల్, బీహార్ రైతుల తిరుగుబాట్లు, 1875లో మహారాష్ట్ర మలబార్ ప్రాంత మాప్లా రైతాంగ తిరుగుబాటు, తూర్పుగోదావరి (రంప) ఏజెన్సీ గిరిజన రైతాంగ తిరుగుబాటు. 1920-22లో ఉత్తరప్రదేశ్ లోని రాయబరేలి, ఫయిజాబాద్, సితాపూర్ జిల్లాల జమీందారీ వ్యతిరేక పోరాటాలు, ఆంధ్ర ప్రాంత పెదనందిపాడు శిస్తు నిరాకరణోద్యమం, పలనాడు అటవీ రైతుల సత్యాగ్రహం, వర్లీ ఆదివాసీ రైతుల తిరుగుబాటు, వాయలార్ రైతుల పోరాటం గాక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దాకా ఉద్యమాలు, పోరాటాలు, ఆందోళనలు ఉధృతంగా సాగినాయి...! ఇవన్నీ భారత జాతీయోద్యమంలో అంతర్భాగమే.

1936 ఏప్రిల్ 11న జరిగిన మొదటి మహాసభలో యేర్పడిన అఖిల భారత కిసాన్ సభ (రైతుసంఘం)... దాని ఆధ్వర్యంలో సాగిన పోరాటాల నుంచీ విశ్లేషించుకోవాలి. చరిత్రాత్మకమైన రైతు రక్షణ యాత్ర (ఇచ్ఛాపురం నుండి మద్రాసు దాకా 130 రోజులు 525 గ్రామాల సందర్శన, 1100 అర్జీల సేకరణతో రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి పెట్టిన డిమాండు పత్రం), జమీందారీ వ్యతిరేక పోరాటాలు సాగాయి. ఆ పోరాటాల ఫలితాలేమిటి? వాటి దిశాదశల్లో మార్పులేమిటో చర్చించుకోవాలి. రైతుసంఘాన్ని చీల్చిన కాంగ్రెస్ రాజకీయాలు, రైతాంగ పోరాట నాయకులను మళ్లించటాలు (మందసా జమీందారీ వ్యతిరేక పోరాట నాయకుల్లో ఒకరు గౌతు లచ్చన్న పాలకవర్గ నాయకుడైనాడు. స్వాతంత్ర్యానంతర పాలనలో భాగమైనాడు), స్వాతంత్ర్య పోరాట కాలాన పోరాటాలకు అలీనంగానో, వ్యతిరేకంగానో వున్నవాళ్లు స్వాతంత్ర్యానంతర పాలనలో లీనం గావటాలు యెందుకు జరిగాయి? రైతాంగ ఉద్యమకారులను కాల్చిచంపిన సంస్థానాధిపతులు స్వతంత్ర దేశంలో పాలకులెలా అవగలిగినారు? అవగలుగుతున్నారు?

కళింగాంధ్రా బొబ్బిలి, విజయనగరం, మందసా, పర్లాకిమిడి, కురుపాం, చీకటి, చెముడు, మేరంగి మొదలైనవి జమీందారీల పాలనలో నలిగిపోయేవి. జమీందారీ వ్యతిరేక పోరాటాలూ కళింగాన బలంగా సాగేయి. 1922లో నిరంకుశ బొబ్బిలి సంస్థానానికి వ్యతిరేకంగా ఆడవరం, లక్ష్మీపురం గ్రామాల రైతులు సింహాద్రి సూర్యనారాయణ నాయకత్వంలో తిరగబడి పెరిగిన శిస్తులను, పన్నులను కట్టలేము అని నిరాకరిస్తే కాల్పులు జరిపేడు సంస్థానాధిపతి. 22 మంది రైతులను అరెస్టు చేసారు. జైలులో ఒక రైతు చనిపోయేడు. కళింగాన మొట్టమొదటి జమీందారీ వ్యతిరేక రైతాంగ పోరాటమిది. మరోవేపు ఆదివాసీ ప్రాంతాన అల్లూరి సీతారామరాజు మన్యం తిరుగుబాటు జరిగింది. మన్య ప్రాంత సమస్యల మీద కూడా రైతుసంఘాలు ఉద్యమాలు నడిపేయి.

1936-37లో జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో జమీందార్లు బలపరచిన అన్నెపు పరశురాం పాత్రో (మాజీ మంత్రి) ని ఓడించి, రైతు నాయకుడు పుల్లెల శ్యామసుందరరావును గెలిపించగలిగింది రైతాంగ ఉద్యమం! ఆ తర్వాత సాగాల్సిన దిశలో రైతాంగ ఉద్యమం సాగలేదు. పుల్లెల శ్యామసుందరరావు అకాల మరణం, గౌతు లచ్చన్న పార్లమెంటరీ రాజకీయాల్లో రైతాంగ లక్ష్యాలను ఎజెండాగా చేయలేకపోవడం, కమ్యూనిస్టుల ప్రభావం లోకి కొందరు వెళ్లాక వర్గపోరాటం లక్ష్యం కావడం, తర్వాత కమ్యూనిస్టు పార్టీల్లో విభేదాలు, చీలికలు...కళింగ ప్రాంత రైతాంగ ఉద్యమ ప్రయాణమవగా దేశవ్యాప్త రైతు సంఘంలో చీలికల్తో, పీలికల్తో బలహీనమయ్యింది. స్వాతంత్ర్యానంతర కాలంలో కూలిరేట్ల పోరాటాలు, బంజరుభూమి కోసం పోరాటాలు, పంటలకు గిట్టుబాటు ధరల కోసం పోరాటాలు వంటివి తప్పా వ్యవసాయ విధానంలో జరగాల్సిన మౌలిక మార్పుల గురించిన పోరాటాలు దేశవ్యాప్తంగా అంతగా జరగలేదు.

జమీందారీ రద్దు నుంచి బూటకపు భూసంస్కరణల దాకా తెల్లోళ్లను మించిన దగాకోరు రాజకీయ విధానాలు ... పెట్టుబడిదార్ల కడుపులు నింపే బొంబాయి ప్లాను నుండి పంచవర్ష ప్రణాళికల దాకా, పూర్తికాని సాగునీటి పారుదల ప్రాజెక్టులు, గిట్టుబాటు కాని పంటల ధరలు, పెరిగిన ఉత్పత్తి ఖర్చుల దాకా ఎన్నెన్నో రైతు దు:ఖానికి కారణాలు.

వ్యవసాయ రంగమిక కార్పొరేట్ల చేతిలోకి వెళ్లాక రైతాంగమే కాక ఆహార దినుసులు కొనుగోలు చేసే వినియోగదారుడు కూడా నష్టపోతాడు. కార్పొరేట్లు తమకు లాభాలనిచ్చే పంటలే పండిస్తారు. అధిక ధరలు లభించే చోటనే అమ్ముతారు...ఈ దేశంలో అమ్ముతారనే గ్యారంటీ కూడా వుండదు. అధిక ధరలు, ఆహార పంటల కొరతలను కూడా భవిష్యత్తులో దేశం ఎదుర్కోవలసి వస్తుంది. గనక కేవలం నేడు రైతాంగ సమస్యగా మాత్రమే గాక సకల ప్రజల సమస్యగా అర్థం చేసుకొని ఆందోళనలు చేయాల్సి వుంది. పోరాడాల్సి వుంది.

ఔను, నేనిలా రాస్తే... భూములున్న రైతుల గురించి రాస్తున్నాననీ, భూమి లేని రైతుల గురించిగానీ, రైతుకూలీల గురించి గానీ, రైతు చుట్టూ బతికే మేదరి, కుమ్మరి, వడ్రంగి, చాకలి, మంగలి సమస్త కులవృత్తి జీవుల గురించి రాయటం లేదని మీరనొచ్చు. చిక్కల్లా అక్కడే వున్నది. రైతుకి న్యాయం జరిగితే గానీ రైతు చుట్టూ బతికే వృత్తిజీవులకు న్యాయం జరగదు. ఇది సమష్టి సమస్య (రైతు యేటేటా వ్యవసాయ ఆదాయంతో తనచుట్టూ వున్న వృత్తిజీవులకు తగిన రీతిలో వేతనాలు చెల్లించలేనందున, వృత్తిజీవులను యేడాదంతా తనతో నిలుపుకోలేనందున కుమ్మరి, చాకలి, మంగలి, మేదరి, కమ్మరి వంటి వృత్తి జీవులు నగరాలకు వలస పోయినారు, రైతుని, గ్రామాన్నీ విడిచిపెట్టేసారు. నగరాల్లో వీరి బతుకులు యెలా వున్నాయి, గ్రామాలలో వున్నపుడు కంటే బాగున్నాయా? బాగుంటాయా? ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవడం వేరే చర్చ.).

అలాగే భూములున్న రైతు, భూమి లేని కూలీ... ఈ సమస్య కూడా పరిష్కారం కావాల్సివుంది. తొలినాటి కిసాన్ సభ అంచేతనే భూ సంస్కరణలను డిమాండు చేసింది. కమ్యూనిస్టులు కూడా ప్రధానంగా భూ సమస్యను దున్నేవానికే భూమి అన్న విధానంతో పరిష్కరించాలంటున్నారు (దున్నేవానికి భూమి ఇవ్వడమనేది స్వంత ఆస్తి ఇవ్వడం కదా? కమ్యూనిజం స్వంత ఆస్తిని అంగీకరించదు కదా, మార్క్స్ కూడా ఇలా చెప్పలేదు, భారతీయ కమ్యూనిస్టులు తప్పుడు సూత్రీకరణలతో పోరాటాలు నడుపుతున్నారని కొందరు వాదనలు చేస్తున్నారు. దున్నేవానికి భూమి నినాదంతో రైతులను కదలించి కార్మికవర్గ నాయకత్వంలో విప్లవాన్ని జయప్రదం చేసే ప్రయత్నంలో భాగంగా ఈ పోరాటాలని కమ్యూనిస్టులంటున్నారు). భూమీ, దానిమీద బతికే వ్యవసాయ వృత్తిజీవుల చుట్టూ అనే కాంశాలు ఇలా ఇంకా చర్చల్లోనే వున్నాయి. పరిష్కారాల వెదుకులాటలోనే వుండడం విషాదం!

వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, పూర్తికాని సాగునీటి ప్రాజెక్టులతో పంటలు పోవటం, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు దొరకక పోవటం, పంటకు పెట్టే మదుపులు (విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, కూలీల వేతనాలూ.) పెరిగిపోవటంతో రైతులు అధికశాతం దివాళా తీసేరు. ఇదే సందర్భంలో పెట్టుబడిదారులు బడా, బడా పెట్టుబడిదారులైనారు, కొసకు కార్పొరేట్ సెక్టారుగా ఎదిగినారు.

వ్యవసాయ రంగాన్ని మూడు విభాగాలుగా తీసుకోవచ్చు. ఉత్పత్తి సాధనమైన భూమి, ఆ భూమి మీద శ్రమ చేసే మనుషులూ వొక విభాగం, పంటలకవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు... ఇన్‌పుట్స్ ఒక విభాగం, పంటలు అమ్ముకొనే మార్కెట్ మరొక విభాగం! రైతు చేతిలో గానీ రైతు ఆధీనంలో గానీ భూమీ, దాని మీద శ్రమ చేసే మనుషులు తప్పా మిగిలిన రెండు విభాగాలూ లేవు. మార్కెట్ శక్తుల చేతిలో వున్నాయి. ఆ శక్తుల క్రీడలో రైతులు దివాళా తీసేరు. ఇన్నేళ్లుగా రకరకాలుగా యెదిగిన మార్కెట్ శక్తుల కన్ను ఇపుడు రైతు చేతిలోని భూమి మీద పడింది. విశాల భూఖండాలను కొనగలిగే, లీజుకు పొందగలిగే ఆర్థిక సంపన్నులయిన మార్కెట్ శక్తులిపుడు వ్యవసాయ రంగాన్ని సంపూర్ణంగా ఆక్రమించదలచేయి. ఇంతకు ముందర పాలనలోనున్న రాజకీయ శక్తుల చేత తమ ఆక్రమణను చట్టబద్ధం చేయలేకపోయిన మార్కెట్ శక్తులకు బిజెపి ఇపుడు నమ్మినబంటుగా రాజకీయ రంగమ్మీదకు వచ్చి ంది. ఆ ఫలితమే మూడు వ్యవసాయ చట్టాలు. ఆ చట్టాలే అమలయితే భవిష్యత్తులో రైతు చేతిలో భూమి మిగలదు.

వ్యవసాయ రంగమిక కార్పొరేట్ల చేతిలోకి వెళ్లాక రైతాంగమే కాక ఆహార దినుసులు కొనుగోలు చేసే వినియోగదారుడు కూడా నష్టపోతాడు. కార్పొరేట్లు తమకు లాభాలనిచ్చే పంటలే పండిస్తారు. అధిక ధరలు లభించే చోటనే అమ్ముతారు...ఈ దేశంలో అమ్ముతారనే గ్యారంటీ కూడా వుండదు. అధిక ధరలు, ఆహార పంటల కొరతలను కూడా భవిష్యత్తులో దేశం ఎదుర్కోవలసి వస్తుంది. గనక కేవలం నేడు రైతాంగ సమస్యగా మాత్రమే గాక సకల ప్రజల సమస్యగా అర్థం చేసుకొని ఆందోళనలు చేయాల్సి వుంది. పోరాడాల్సి వుంది.

రైతాంగం కూడా కేవలం ఆర్థిక సమస్యల పరిష్కారం కోసమే గాక తమ సమస్యకు శాశ్వతమయిన శాస్త్రీయ పరిష్కారాన్ని సాధించే దిశగా రాజకీయ రంగంలో కూడా రైతాంగం తమ భాగస్వామ్యాన్ని సాధించే (అసెంబ్లీ, పార్లమెంటులలో తమ డిమాండ్లను, తమ సమస్యలను తొలినాటి రైతుసంఘ మహాసభల నుంచీ ప్రకటించుకు వస్తోన్న తమ లక్ష్యాలను రాజకీయ ఎజెండాను చేసే) దిశగానూ గత ఉద్యమ చరిత్ర లోంచి పాఠాలు తీసుకొని ఉద్యమాలు సాగించాలి! దేశం సంపన్నం కావడమంటే అశేష ప్రజలు సంపన్నులు కావడం. అంతే తప్ప అల్ప సంఖ్య కార్పొరేట్లు సంపన్నులు కావటం కాదు! దేశ సంపన్నత కోసం, సౌభాగ్యం కోసం రైతాంగం పోరాటాల చాలు పోయాలి!

/ వ్యాసకర్త: ఉత్తరాంధ్ర రచయితల, కళాకారుల వేదిక అధ్యక్షులు /

అంతర్జాతీయం

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ప్రజాగ్రహం

అమీన్

ఫ్రాన్స్‌లో రిటైర్మెంట్ వయసు పెంపకం, ఇజ్రాయెల్‌లో న్యాయ సంస్కరణల పేరుతో ప్రజాస్వామ్యం గొంతు నొక్కడం, జర్మనీలో పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం, కెన్యాలో అధిక ధరలతో సతమతం కావడం, యుద్ధం కారణంగా అమెరికాలో పెరుగుతున్న జీవన వ్యయం భరించలేకపోవడం...ఇలా ఒక్కో దేశంలో ఒక్కో కారణం కనిపిస్తున్నా, అన్నింటా స్పష్టమయ్యేది పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల దివాళాకోరుతనమే. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వృద్ధి రేటు మందగిస్తున్న స్థితిలో ప్రజలను మరింత పీడించేందుకు ఆయా దేశాల్లో పాలకులు యత్నిస్తున్నారు. ప్రజలపై భారాలు మోపుతూ కార్పోరేట్ల లాభాలు తగ్గకుండా చూస్తున్నారు. ఓవైపు ఆర్థిక సంక్షోభ ఛాయలు అలముకుంటున్నా బడాబాబుల లాభాలకు ఢోకా లేకుండా చూస్తున్న ప్రభుత్వాల తీరు మూలంగానే ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. సమ్మెలకు చోటు లేదని చెప్పిన దేశాల్లోనే మొత్తం వ్యవస్థను స్తంభింపజేసే రీతిలో ఇప్పుడు కార్మికవర్గం కదులుతోంది. పైన పేర్కొన్న దేశాల్లోనే కాకుండా ఇంగ్లాండ్, బెల్జియం, పోలెండ్...అనేక యూరప్ దేశాల్లో రోజుల తరబడి సమ్మెలు కొనసాగుతున్నాయి. దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాల్లో సైతం కార్మికులు వివిధ రూపాల్లో తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రపంచం నలుమూలలా ఆందోళనల అలజడి రేగుతోంది. కార్మిక పోరాటాల తీవ్రత పెరుగుతోంది. వరుస సమ్మెలతో ప్రభుత్వాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి.

కుదిపేస్తున్న సమ్మెలు

సోవియట్ యూనియన్ పతనానంతరం 1990ల నుంచి నయా ఉదారవాద విధానాలు జోరందుకుంటున్నాయి. అన్ని దేశాల్లోనూ కార్మికుల సంఘటిత శక్తిని దెబ్బతీసే ప్రయత్నాలు పెరిగాయి. యూనియన్లకు, సమ్మెలకు అవకాశం లేకుండా చేసిన దేశాలు కూడా ఉన్నాయి. అయినా గానీ 2000 సంవత్సరం ఆరంభంలో సియాటెల్ వంటి ప్రాంతాల్లో మొదలయ్యి ప్రపంచ సామాజిక వేదికల పేరుతో పోరాడే శక్తులు మళ్లీ కొంత ప్రయత్నం చేశాయి. కానీ కోవిడ్ తర్వాత ఇప్పుడు ప్రపంచ బడా ఆర్థిక వ్యవస్థలు మాంద్యం దిశలో పయనిస్తుండడం ప్రజలకు పెనుభారం అవుతోంది. అంతిమంగా దానిని సహించలేని కార్మికులు మరోసారి తమ నిరసనను సమ్మెల రూపంలో వ్యక్తం చేస్తున్నారు. జర్మనీలో దేశవ్యాప్త సమ్మె జరగడంతో గతవారం రవాణా వ్యవస్థ స్తంభించింది. ఇంత భారీ సమ్మె నిర్వహించడం 1992 తర్వాత ఇదే మొదటిసారి. మొత్తం విమాన సర్వీసులన్నీ రద్దయ్యాయి. రైళ్లు ఎక్కడివక్కడే నిలిచి పోయాయి. బస్సులు, ఇతర మోటారు వాహనాలు ఆగిపోయాయి. పెరిగిన ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతన సవరణ కోసమంటూ దేశంలోని ప్రధాన కార్మిక సంఘాలు ఐక్యంగా ఇచ్చిన పిలుపుతో 24 గంటల సమ్మె చరిత్రకెక్కింది. జర్మనీకి ముందు నుంచే మరో పెద్ద దేశం ఇంగ్లాండ్ లోనూ తీవ్రస్థాయిలో ఉద్యమాలు సాగుతున్నాయి. రైల్వే, పోస్టల్, హెల్త్ సర్వీసుల్లో పనిచేసే కార్మికులంతా సమ్మెకి దిగడం, 15 లక్షల మంది రోడ్డు మీద నిరసనలకు దిగడం ఈ ఏడాది ఆరంభంలోనే జరిగింది.



ఫ్రాన్స్‌లో పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా...

అణచివేత

ఓవైపు సమ్మెలు, ఉద్యమాల తాకిడి పెరుగుతుండడంతో ఆయా పెట్టుబడిదారీ ప్రభుత్వాలు తీవ్ర అణచివేతకు పాల్పడుతున్నాయి. చైనాలో జీరో కోవిడ్‌ని నిరసిస్తూ కొందరు రోడ్డు మీదకు రాగానే ప్రపంచ పెట్టుబడిదారీ మీడియా గగ్గోలు పెట్టింది. చైనా ప్రభుత్వం వెంటనే తన విధానంలోని లోపాలను సవరించుకుంది. ప్రజాభిప్రాయాన్ని గౌరవించడమే నిజమైన ప్రజాస్వామ్యం అని చాటిచెప్పింది.

అదే సమయంలో ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఉద్యమం వీధి పోరాటాన్ని తలపిస్తోంది. అక్కడ రిటైర్మెంట్ వయసుని 62 నుంచి 64కి పెంచడం ద్వారా ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లింపు వాయిదా వేయవచ్చని ప్రభుత్వం ఆశిస్తోంది. ఇది ఉద్యోగాల కల్పన మీద, వృద్ధాప్యంలో పనిభారం మీద ప్రభావం చూపుతుందంటూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. యువత, విద్యార్థులు కూడా కార్మికులతో చేతులు కలిపారు. ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. దేశం స్తంభించింది. పారిస్ మహానగరంలో వీధి పోరాటాలను తలపించే స్థాయిలో మంట చెలరేగింది. ప్రభుత్వం మాత్రం ప్రజాభిప్రాయాన్ని పక్కన పెట్టి పార్లమెంట్‌లో చట్టం రూపొందించడానికి సిద్ధపడింది. ప్రతిపక్షాలు విమర్శిస్తున్నా అధ్యక్షుడు తన విశేషాధికారాన్ని వినియోగించి చట్టం చేసేందుకు ప్రయత్నించడంతో ఉద్యమం మరింత తీవ్రతరమైంది. ఉద్యమంపై మాక్రాన్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. అందరికీ ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్పే పెట్టుబడిదారీ దేశాల్లో ప్రజల గొంతుని ఎంతగా అణచివేస్తారన్నది సోషల్ మీడియాలో వీడియోలు చాటుతున్నాయి.

ఫ్రాన్స్‌లో మాత్రమే కాదు..ఇజ్రాయెల్‌లో సైతం ఇదే తంతు. మోడీ మిత్రుడు నెతన్యాహూ అక్కడ ప్రధానమంత్రిగా ఎన్నికయిన తర్వాత న్యాయ వ్యవస్థ పరిధిని కుదించే పనికి పూనుకున్నారు. సరిగ్గా మన దేశంలో న్యాయశాఖ మంత్రి, ఉప రాష్ట్రపతి భారత న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు మీద దాడి చేస్తున్న సమయంలోనే ఇజ్రాయెల్‌లో న్యాయ సంస్కరణల పేరుతో సర్వహక్కులు తన గుప్పెట్లో పెట్టుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీనిని ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. చివరకు రక్షణమంత్రి సైతం వ్యతిరేకతను వెల్లడించారు. అయినప్పటికీ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. ప్రజల ఉద్యమాన్ని పక్కదారి పట్టించేందుకు పాలస్తీనా, ఇరాన్ వంటి దేశాలతో పాటు సిరియా మీద కూడా దాడులు చేస్తూ జనం దృష్టిని మళ్లించే యత్నం చేసింది. అయినా అక్కడి జనం నిర్బంధాన్ని ఎదిరించి ముందుకు సాగుతున్నారు.

భారాలు సహించలేక...

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతుండడం యూరప్ ప్రజల కష్టాలను తీవ్రం చేస్తోంది. పిల్లికి చెలగాటం- ఎలుకకి ప్రాణ సంకటం అన్నట్టుగా మారుతోంది. అమెరికా, యురోపియన్ పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం రష్యాతో వైరం కొనితెచ్చుకుని ఏడాదిగా దానిని కొనసాగించడానికి ఆపసోపాలు పడుతున్నారు. యుద్ధం పుణ్యమా అని ఆహారం, ఇంధనం ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. వాటి భారాన్ని యూరప్ దేశాల ప్రజలు సహించలేకపోతున్నారు. రోడ్డెక్కి తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, యుద్ధానికి సహకరించకూడదని వారు డిమాండ్ చేస్తున్నారు.

యూరప్‌తో పాటుగా యుద్ధం కారణంగా అత్యధికంగా నష్టపోతున్న ఆఫ్రికా ప్రజల పరిస్థితి మరీ దారుణం. ఆఫ్రికన్ ప్రజల ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకు వేర్పాటువాదులు ప్రయత్నిస్తున్నారు. ఆహారం ధరలు పెరిగిపోవడం వల్ల ఆకలితో అలమటిస్తున్న కెన్యా ప్రజలు దేశ రాజధానిలో ప్రభుత్వ దళాలతో తలబడ్డారు. అమెరికాలో కూడా అదే పరిస్థితి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం కారణంగా అమెరికన్ ఆయుధ, ఆయిల్ కంపెనీల లాభాలు పెరుగుతున్నాయి. కానీ పెరిగిన ధరలతో సామాన్య అమెరికన్లు అల్లాడిపోతున్నారు. ఓవైపు ఉపాధి కోల్పోవడం, మరోవైపు పెరిగిన ఆర్థిక భారం కలిసి వారిని ఇక్కట్ల పాలుజేస్తున్నాయి. ఐఎంఎఫ్ విధానాలను నెత్తికెత్తుకుని శ్రీలంక ఇప్పటికే సంక్షోభంలో కూరుకుపోయింది. తాజాగా పాకిస్తాన్ కూడా తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది.

సరిగ్గా రెండో ప్రపంచ యుద్ధానికి పూర్వం కూడా మహమ్మారి వ్యాపించడం, ఆ తర్వాత తీవ్ర ఆర్థిక మాంద్యం ప్రపంచాన్ని చుట్టుముట్టడం, చివరకు సమ్మెల వెల్లువని నివారించేందుకు నియంతృత్వ ఫాసిస్టు పోకడలు ప్రబలడం, అంతిమంగా అది రెండో ప్రపంచ యుద్ధానికి దారితీయడం వంటి అనుభవాలున్నాయి. చరిత్ర పునరావృతమవుతుందా? ఓవైపు ప్రపంచ రాజకీయ సమీకరణాల్లో చైనా ప్రభావం పెరుగుతోంది. అమెరికన్ ఆధిపత్యానికి మూలమైన డాలర్‌కు బదులు లోకల్ కరెన్సీకి ప్రాంతీయ ఆర్థిక కూటములు మొగ్గు చూపుతున్నాయి. డాలర్ స్థానంలో యువాన్ సహా వివిధ కరెన్సీలు ముందుకొస్తున్నాయి. దాంతో ప్రపంచ రాజకీయ ముఖచిత్రం మారే సూచనలు కనిపిస్తున్నాయి. ★

14 పార్టీల పిటిషన్ తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ : ప్రతిపక్ష నేతలకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రభుత్వం ఏకపక్షంగా దుర్వినియోగపరుస్తోందని విమర్శిస్తూ, భవిష్యత్తు మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ 14 ప్రతిపక్ష పార్టీలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీం కోర్టు బుధవారం తిరస్కరించింది. "ఒక కేసు వాస్తవాలతో సంబంధం లేకుండా సాధారణ మార్గదర్శకాలను రూపొందించడం ప్రమాదకరం" అంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దివాలాలతో కూడిన బెంచ్ పేర్కొంది. పిటిషన్ విచారణకు సుప్రీం సుముఖంగా లేదని గ్రహించిన సీనియర్ న్యాయవాది ఎఎం సింఘ్వి.. పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరారు.

దక్షిణ సూడాన్‌కు భారత్ సాయం

- రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ : కొత్త రాజ్యాంగాన్ని రూపొందించడంతో సహా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో భారతదేశ అనుభవం నుండి దక్షిణ సూడాన్ లబ్ధి పొందవచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో సూడాన్‌కు పూర్తి స్థాయి మద్దతును భారత్ అందచేస్తుందన్నారు. దక్షిణ సూడాన్ నుండి వచ్చిన పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి రాష్ట్రపతి భవన్ వద్ద రాష్ట్రపతి స్వాగతం పలికారు. దక్షిణ సూడాన్ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ జెమా నూను కుంబా నేతృత్వంలో ఈ బృందం భారత్‌లో పర్యటిస్తోంది. దక్షిణ సూడాన్‌లో ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక బృందం కార్యకలాపాలకు భారత్ ప్రధానంగా సేవలందించడం గర్వకారణంగా వుందన్నారు.



ర్యాలీలో ప్రసంగిస్తున్న హేమలత

మజ్దూర్,కిసాన్ మార్చ్ చారిత్రాత్మకం

- దేశ భవిష్యత్తుకు మార్పు అవసరం
- 2024లో మోడీ సర్కార్‌ను గద్దెదించుతాం
- ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది
- కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ సంస్థలు ధారాదత్తం చేస్తోంది
- మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ మార్చ్‌లో నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ మార్చ్ చారిత్రాత్మకమని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పేర్కొన్నారు. బుధవారం రాం లీలా మైదానంలో సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ మార్చ్‌లో ఆయా సంఘాల నేతలు మాట్లాడారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ ఈ మార్చ్ జాతీయ స్థాయిలో జరిగిందని, ఇలాంటి ర్యాలీలు క్షేత్ర స్థాయిల్లో కూడా జరగాలని అన్నారు. దేశ భవిష్యత్తు కోసం మార్పు అవసరమని స్పష్టం చేశారు. కార్పొరేట్, మతోన్మాద మోడీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు గర్జించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

సిఐటియు అధ్యక్షురాలు కె. హేమలత మాట్లాడుతూ దేశంలో కరోనా సమయంలో లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని, మరోపక్క అదానీ, అంబానీల ఆస్తులు పెరిగాయని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం పేదల వద్ద లాక్కొని, పెద్ద పెద్ద కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం రంగ సంస్థలను ధారాదత్తం చేశారని దుయ్యబట్టారు. యువతకు ఉద్యోగాలు లేవని, ఆకలితో పేదలు ఉన్నారని తెలిపారు. కానీ మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఎఐకెస్ అధ్యక్షులు అశోక్ దావలే మాట్లాడుతూ మోడీ సర్కార్, బిజెపి, ఆర్ఎస్ఎస్ కార్పొరేట్ల కోసం మాత్రమే పని చేస్తున్నారని, ఇకనైనా దేశంలోని రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల కోసం పని చేయాలని హితవు పలికారు. దేశంలో ఆక్సిజన్, ఆసుపత్రి బెడ్లు, మెడిసిన్ లేక లక్షలాది మంది ప్రజలు మరణించారు. ఆకలితో లక్షలాది మంది మరణిస్తున్నారు. ఉద్యోగాలు లేక యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యల చేసుకుంటున్నారు. మత్నోనాద అల్లర్ల వల్ల వందలాది మంది మరణిస్తున్నారు అని పేర్కొన్నారు. 2024లో మోడీ సర్కార్‌ను ఓడిస్తామని, అందులో అనుమానమే లేదని స్పష్టం చేశారు.



ట్రిపుల్ ఇంజన్‌తో మోడీని ఓడిస్తాం

ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ, ప్రధాని మోడీ తెల్లారితే డబుల్ ఇంజిన్ పాలనంటూ ఊదరగొడుతున్నారని, అయితే ఆ డబుల్ ఇంజన్‌లో ఒకటి మోడీ, అమిత్ షా ఇంజన్, రెండోది అంబానీ, అదానీ ఇంజన్, మూడోది కార్పొరేట్, మతోన్మాద ఇంజన్ అని ఎద్దేవా చేశారు. దేశానికి వినాశకారిగా ఉన్న డబుల్ ఇంజన్‌ను కార్మికులు, రైతుల, వ్యవసాయ కార్మికులతో కూడిన ట్రిపుల్ ఇంజన్‌తో ఓడిస్తామని స్పష్టం చేశారు. మోడీ ఆటలు ఇక సాగవని అన్నారు. ఉపాధికి హామీ చట్టం అయినప్పుడు బడ్జెట్‌లో 4 శాతం నిధులు కేటాయించారని, మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత కేటాయింపులు 3 శాతం, 2 శాతం తగ్గించుకుంటూ, ప్రస్తుత బడ్జెట్ 1.3 శాతానికి తగ్గించారని విమర్శించారు. ఆహార భద్రత విషయంలో కూడా గతేడాది బడ్జెట్‌లో రూ.2.87 లక్షల కోట్లు కేటాయిస్తే, రూ.1.97లక్షల కోట్లకు తగ్గించారని దుయ్యబట్టారు. దాదాపు రూ.90 వేల కోట్ల కోత విధించారని తెలిపారు. దేశంలో 32 కోట్ల మంది ఎస్‌సి (17 శాతం), ఎస్‌టి (7 శాతం) పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అన్నారు.

మార్చ్‌లో వేలాది మంది ఏపి కార్మిక, కర్షకులు

మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీలో వేలాది మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగ్ రావు, కార్యవర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, వి.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి, కె. ఉమామహేశ్వరరావు, నూర్ మహ్మద్, దయా రమాదేవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు శివనాగరాణి, ఎ.రవి, ఈ.అప్పారావు, కె.నారాయణ, ఎం.నాగేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎం. సూర్యానారాయణ, చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఎఐఎడబ్ల్యుయు అధ్యక్షుడు ఎ.విజయరాఘవన్ మాట్లాడుతూ పేదలను దుఖంలోకి నెట్టే పాలన మోడీ సాగిస్తున్నారని దుయ్యబట్టారు. పేదలకు ఇచ్చే సబ్సిడీలను రద్దు చేస్తున్నారని, పేదలకు సంబంధించిన పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధిస్తున్నారని దుయ్యబట్టారు. పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. మరోవైపు యువతకు ఉద్యోగ కల్పన చేయటం లేదని విమర్శించారు. ఏడాది రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి మోడీ, తొమ్మిదేళ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని అన్నారు. కానీ ఆ హామీని మరిచారని దుయ్యబట్టారు. దేశంలోని పేదలకు ఉద్యోగాలు కల్పించని మోడీ, గోరక్షక్ పేరుతో రెచ్చిపోతున్న మూకలకు ఉద్యోగాలు ఇచ్చారని ధ్వజమెత్తారు. వీటితో పాటు సిఐటియుకు అనుబంధంగా ఉన్న 12 సెక్టోరల్ ఫెడరేషన్‌లు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంస్థలు, బ్యాంకు, బీమా, బిఎస్ఎన్, ఎఐఎస్‌జిఇఎఫ్, సిసిజిఇయు నాయకులు కూడా ర్యాలీలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, ఎంపిలు శివదాసన్, నటరాజన్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ మాట్లాడుతూ మోడీ పాలనలో లక్షకు పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, రెండున్నర లక్షలకు పైగా రోజు వారీ కూలీలు ఆత్మహత్యకు చేసుకున్నారని తెలిపారు. కార్పొరేట్ లూటీకి వ్యతిరేకంగా మరిన్ని ఐక్య పోరాటాలు నిర్వహిస్తామనిఅన్నారు. ఐక్య పోరాటంతోనే భూసేకరణ ఆర్డినెన్స్‌ను ఆపగలిగామని, మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయించగలిగామని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని ఆయన విమర్శించారు. దేశాన్ని లూటీ చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద మోడీ ప్రభుత్వాన్ని 2024లో గద్దెదించుతామని స్పష్టం చేశారు.



సిపిఎం సంఘీభావం

ర్యాలీలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బృందాకరత్, బివి రాఘవులు, ఎంఏ బేబి, నీలోత్పల్ బసు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం దావలే, కోశాధికారి ఎస్. పుణ్యవతి, సిఐటియు నాయకులు ఎఆర్ సింధూ తదితర సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు.

ప్రజలపై దాడి తీవ్రతరం : ప్రభాత్ పట్నాయక్



ప్రజలపై మోడీ సర్కార్ దాడి తీవ్రతరం చేసిందని ఆహ్వాన సంఘం చైర్మన్, ప్రముఖ ఆర్థిక వేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ అన్నారు. దేశంలో నయా ఉదారవాద పాలన కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలపై తీవ్ర దాడిని ప్రారంభించిందని వివర్శించారు. దీని ఫలితంగా గత రెండు దశాబ్దాలుగా మూడు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వ హయాంలో ఈ దాడి మరింత తీవ్రమైందని అన్నారు. ఎన్ఎస్ఎస్ డేటా ప్రకారం 2011-12 నుండి 2017-18 మధ్య గ్రామీణ భారతదేశంలో తలసరి వాస్తవ నెలవారీ వ్యయం 9 శాతం క్షీణించిందని తెలిపారు. ఈ డేటాను పూర్తిగా అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలతో ఈ అధిక దాడిని సంస్థాగతీకరించడానికి ప్రయత్నించిందని అన్నారు. అయితే రైతుల వీరోచిత ప్రతిఘటన వెనక్కి తగ్గేలా చేసిందని, కానీ అది తన ఉద్దేశాన్ని వదులుకోలేదని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులు ఉపాధికి దూరం అవుతున్నారని తెలిపారు. మోడీ విధానాలకు నష్టపోయేది కేవలం ఈ వర్గాలే కాదని, దేశం మొత్తం అగాధంలోకి నెట్టబడుతోందని విమర్శించారు. ఆహార ధాన్యాల సాగు నుండి రైతులను దూరం చేస్తున్నారని, ఇది ఆహార భద్రతను దెబ్బతీస్తుందని అన్నారు. సంపద అసమానతల్లో తీవ్రమైన పెరుగుదల ఉందని, పెరుగుతున్న ఈ అసమానతను ఎదుర్కోవడానికి బదులుగా ప్రభుత్వం కార్పొరేట్ ధనికులకు పన్ను రాయితీలు ఇస్తుందని విమర్శించారు. "క్రోనీ క్యాపిటలిజం (ఆశ్రిత పెట్టుబడి)" బహిరంగ విచ్చలవిడిగా నాట్యం చేస్తుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారందరినీ భయభ్రాంతులకు గురిచేయడం, ప్రతిపక్ష రాజకీయాల పార్టీలను అంతమొందించడానికి ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. మైనారిటీ వర్గాలకు వ్యతిరేకంగా విషపూరితమైన ద్వేషాన్ని పెంచుతున్నారని పేర్కొన్నారు. శ్రామిక ప్రజలపై దాడికి వ్యతిరేకంగా పోరాడటానికి, ప్రజాస్వామ్యాన్ని, ప్రతిఘటించే హక్కును రక్షించడానికి, దేశాన్ని లౌకిక గణతంత్ర రాజ్యంగా పరిరక్షించడానికి, ఆధునిక భారతదేశం నిర్మించిన రాజ్యాంగం స్థాపించడానికి, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఒకే వేదికపైకి వచ్చే ప్రక్రియలో భాగంగానే ఈ ర్యాలీ పాల్గొన్న అందరికీ శుభాకాంక్షలను ప్రకటించారు.

ఢిల్లీ నలుమూల నుండి ర్యాలీలు

దేశ రాజధాని ఢిల్లీ నలుమూలల నుండి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ర్యాలీలు రాంలీలా మైదానానికి చేరుకున్నాయి. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ (అజ్మీరీ గేట్), పాత ఢిల్లీ రైల్వే స్టేషన్ (శిష్ గంజ్ గురుద్వారా), సరాయ్ రోహిల్లా రైల్వే స్టేషన్ (గురుద్వారా రకబ్ గంజ్), గురుద్వారా బంగ్లా సాహెబ్, అంబేద్కర్ భవన్ నుండి ఐదు ప్రధాన ప్రదర్శనలు, వీటితో పాటు వివిధ ప్రాంతాల నుండి చిన్న చిన్న ర్యాలీలు రాంలీలా మైదా కు చేరుకున్నాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ర్యాలీలు, మద్యాహ్నం రెండు గంటల వరకు రాంలీలా మైదానానికి వస్తునే ఉన్నాయి. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు క్రమ శిక్షణతో నినాదాలిచ్చుకుంటూ ముందుకు సాగారు.

సత్తా చాటిన మహిళలు

ఢిల్లీని ఎర్రని సముద్రంగా మార్చిన మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సత్తా చాటారు. నిర్వాహకుల అంచనాలను సైతం తలకిందులు చేస్తూ వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు అపూర్వంగా పాల్గొన్నారు. అస్సాంకు చెందిన 1,500 మంది ప్రతినిధులలో 80 శాతం మంది మహిళలే ఉన్నారు. మహారాష్ట్ర, బెంగాల్, రాజస్థాన్, మణిపూర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి ఎక్కువ మంది మహిళలు హాజరయ్యారు. రైతుల విజయం, అంగన్‌వాడీ ఉద్యమ విజయం ఉత్తర భారత గ్రామాల్లో మహిళల భాగస్వామ్యానికి నిదర్శనం. అంగన్‌వాడీ ఫెడరేషన్ బలమైన పోరాటాలను నిర్వహించిన హర్యానా నుండి ఎక్కువ మంది మహిళలు పాల్గొన్నారు.

జాతీయ భద్రత సాకు మాత్రమే !

- ఆ పేరుతో పౌర హక్కులు నిరాకరిస్తున్నారు
- మీడియా వన్‌పై నిషేదం చెల్లదు
- కేంద్రానికి సుప్రీం మొట్టికాయలు



న్యూఢిల్లీ : రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను హరించివేయడానికి జాతీయ భద్రతను ఒక సాధనంగా ప్రభుత్వం ఉపయోగించుకుంటోందని, ఇది చట్టబద్ధపాలనకు అనుగుణంగా లేదని సుప్రీం కోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. మలయాళం వార్తా చానెల్ 'మీడియా వన్'పై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేదాన్ని రద్దు చేసింది. ఈ సందర్భంగా కేంద్రంలోని మోడీ సర్కార్‌కు సర్వోన్నత న్యాయస్థానం మొట్టికాయలు వేసింది. ప్రభుత్వ విధానాలను విమర్శించడమనేది మీడియా లేదా టెలివిజన్ చానెల్ లైసెన్స్‌ను రద్దు చేయడానికి ఒక కారణం కారాదని సుప్రీం స్పష్టం చేసింది.

భద్రతా కారణాల రీత్యా మీడియావన్ ప్రసారాలను నిషేధించాలన్న కేంద్రం నిర్ణయాన్ని సమర్థిస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మీడియా వన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు పై వ్యాఖ్యలు చేసింది. పౌరుల హక్కులను నిరాకరించడానికి జాతీయ భద్రతను ప్రభుత్వం సాకుగా చూపుతోందంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర హోంమంత్రిత్వశాఖను తీవ్రస్థాయిలో మందలించింది. ఇలాంటి స్వల్ప విషయాలకు జాతీయ భద్రతను క్లెయిమ్ చేయలేమని, వాటికి మద్దతుగా పాదార్థిక వాస్తవాలు వుండాలని వ్యాఖ్యానించింది. 'ప్రజాస్వామ్య రిపబ్లిక్ క్రియాశీలంగా పనిచేయడానికి స్వతంత్రంగా పనిచేసే మీడియా చాలా కీలకం. ప్రజాస్వామ్య సమాజంలో దాని పాత్ర చాలా ముఖ్యమైనది. ప్రభుత్వ పనితీరుపై ఇదొక వెలుగునిస్తుంది. వాస్తవాలు మాట్లాడాల్సిన, పౌరులకు కఠోరమైన వాస్తవాలను అందచేయాల్సిన, ప్రజాస్వామ్యాన్ని సరైన దిశలోకి నడిపించే బాధ్యత మీడియాకు వుంటుంది. పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తే పౌరులు కూడా అదే పద్దతిలో ఆలోచించాల్సి వుంటుంది. చీకటిలో పోరాటానికి సదరు సంస్థను నెట్టిందని పేర్కొంది.

సీల్డ్ కవర్ పద్ధతిపైనా తలంటిన ధర్మాసనం

జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలపై విచారణ సందర్భంగా సీల్డ్ కవర్ అందచేసే పద్ధతిని కోర్టులు అనుసరించడానికి సమగ్ర మార్గదర్శకాలను విధించింది. "ప్రజా రక్షణ చర్యల ద్వారా పరిష్కరించలేని ప్రమాదాలను కప్పిపుచ్చడానికి సీల్డ్ కవర్ పద్ధతిని ప్రవేశపెట్టలేం. జాతీయ భద్రతా ప్రయోజనాలను పరిశీలించేటపుడు సహజ న్యాయ సిద్ధాంతాలను మినహాయించవచ్చు, కానీ, మొత్తంగా విషయాన్ని కప్పిపుచ్చడాన్ని అనుమతించలేం. సహజన్యాయం, బహిరంగ న్యాయ సిద్ధాంతాలను సీల్డ్ కవర్ పద్ధతు ఉల్లంఘిస్తుంది." అని కోర్టు పేర్కొంది. పౌరసత్వ సవరణ చట్టం, 2019, జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్‌సి)పై చానెల్ ఇచ్చిన కథనాన్ని, న్యాయ వ్యవస్థను, ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని ప్రాతిపదికగా చేసుకుని చానెల్‌ను ప్రభుత్వ వ్యతిరేకిగా ముద్ర వేయడాన్ని ఏ మాత్రమూ సమర్థించలేమని బెంచ్ రూలింగ్ ఇచ్చింది. అన్ని ఇంటెలిజెన్స్ నివేదికలను రహస్యంగా పేర్కొలేమని, ఎందుకంటే ఇవి పౌరుల హక్కులు, స్వేచ్ఛను ప్రభావితం చేస్తాయని బెంచ్ పేర్కొంది.





సునీత్ చోప్రాకు తుది వీడ్కోలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం నేత సునీత్ చోప్రాకి వేలాది మంది సంతాపం తెలిపారు. మంగళవారం సునీత్ చోప్రా తుదిశ్వాస విడిచిన ఆయన భౌతికకాయాన్ని బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయనకు నివాళులు అర్పించేందుకు వేలాదిగా తరలివచ్చారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బృందా కరత్, ఎంఏ బేబి, బివి రాఘవులు, నీలోత్పల్ బసు, తపన్‌సేన్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయరాఘవన్, బి వెంకట్, ఎంపి వి శివదాసన్, ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, అశోక్ ధావలే, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, డివైఎఫ్ఐ అధ్యక్షుడు, ఎంపి ఎఎ రహీం, ప్రధాన కార్యదర్శి హిమఘ్నరాజ్ భట్టాచార్య, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిశ్వాస్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం దావలే, ఐద్వా నేత మెమూనా మొల్లా తదితరులు నివాలులర్పించారు. పలువురు కళాకారులు, విమర్శకులు, ఉత్తర కొరియా ప్రతినిధులు, జెఎన్‌యు, ఢిల్లీ యూనివర్శిటీ వంటి విద్యాసంస్థల విద్యార్థులు, జర్నలిస్టులు తదితరులు సునీత్ చోప్రాను కడసారి చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తమ ప్రియమైన సహచరుడిని చూసి ఉత్తర కొరియా ప్రతినిధులు కన్నీళ్లు పెట్టుకున్నారు. సునీత్ చోప్రా భార్య సుమిత్రా చోప్రా, సోదరీమణులు, బంధువులు కన్నీటి వీడ్కోలు పలికారు. సాయంత్రం 4 గంటలకు లోధిరోడ్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. సునీత్ చోప్రా మరణం పట్ల అఖిత భారత కార్మిక సంఘం మాజీ అధ్యక్షులు పాటూరు రామయ్య సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.




ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న సిఐటియు బృందం


కిసాన్‌సభ నాయకులకు అభినందనలు తెలియజేస్తున్న సీతారాం ఏచూరి

కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ ర్యాలీ చిత్రమాలిక


ఆంధ్రప్రదేశ్‌తో బృందంతో పాటు ర్యాలీలో కూర్చున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

- తమ బ్యాగులు, ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న వస్తువులను భూజాల పెట్టుకొని, నెత్తిపై మోసుకుంటు ర్యాలీలో కదిలిన కార్మిక, కర్షకులు
- దారిపొడువునా మోడీ ప్రభుత్వ వ్యతిరేక నినాదాల హెూరు
- కాలినడక చెప్పులు లేకుండా అనేక మంది ర్యాలీలో కనిపించారు
- అత్యధిక భాగం మహిళలు ప్రదర్శనలో భాగస్వామ్యం అయ్యారు.
- ఎక్కడా ఎలాంటి అవాఛనీయ ఘటన తలెత్తకుండా క్రమశిక్షణతో మెలిగిన కార్మిక, కర్షకులు
- వివిధ రాష్ట్రాల కార్మిక, కర్షకులు ప్రాంతీయ భాషల్లో నినాదాలు
- అస్సాం, మణిపూర్ వంటి ఈశాన్య, రాజస్థాన్, హర్యానా వంటి ఉత్తరాది రాష్ట్రాల మహిళ తమ రాష్ట్రాల సాంప్రదాయ వస్త్రాధారణలో కనిపించారు.
- కేరళ, తమిళనాడు, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాల పురుషులు సాంప్రదాయ దోతి (లుంగీ) వస్త్రాదారణతో కనిపించారు.
- ఉత్తరాది రైతులు తమ సాంప్రదాయ సిలకట్టును, తలపాగాతో పురుషులు హాజరయ్యారు.
- సోదర సంఘాల సంఘీభావం
- ఆలోచింప చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు
- వేదిక వద్ద లాల్ సలామ్, రెడ్ సెల్యూట్ నినాదాలు




ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్న మహిళలు



బిజెపి పాలనలో చిప్ప మాత్రమే మిగిలిందంటూ వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తున్న ఆంధ్రప్రదేశ్ బృందం



కార్మికుల, కర్షకుల ఐక్యత వర్ధిల్లాలంటూ మద్దతు తెలియజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు


మండు వేసవిలో పరదాలు వేసుకొని ఆందోళనలో పాల్గొన్న మహిళలు




కేరళ నుంచి ర్యాలీలో పాల్గొన్న ప్రతినిధులు



తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్న కార్మిక, కర్షక సంఘాల ప్రతినిధులు



మిత్ర వాణి నిర్ణయం



విజయ పురి రాజ్యాన్ని పాలించే చంద్రసేనుడు అకాలంగా మరణించారు. దాంతో ఆయన కుమార్తె మిత్రవాణి సింహాసనాన్ని అధిష్టించింది. ఏ అనుభవం లేని ఓ మహిళ రాజ్యాన్ని పాలించడం ఏంటి? అని ఆస్థానంలో కొంత మంది మంత్రులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. అవేమి పట్టించుకోకుండా మిత్రవాణి మంత్రి సుమంతుని సలహాలతో చక్కగా పరిపాలన చేయసాగింది. ఒకరోజు సుమంతునితో 'మంత్రి వర్య! మన ఆస్థానంలో సగం ఉద్యోగాలకు మహిళలను నియమించాలనుకుంటున్నా. ఏమంటారు?' అంది.


మంత్రి 'మీ నిర్ణయం సరైనదే. కానీ మహిళలు ముందుకు రారేమో' అని సందేహం వెలిబుచ్చారు. మిత్ర వాణి 'ఉద్యోగం ఇస్తామంటే ఎందుకు రారు?'. అంటూ భటుల చేత దండోరా వేయించింది.

దండోరా వేసి రోజులు గడుస్తున్నా మహిళలు ఎవరూ ఉద్యోగం కోసం ఆస్థానానికి రాలేదు. మిత్ర వాణి ఆలోచించి, సుమంతునితో 'మంత్రివర్యా! మీరు అన్నట్లే ఒక్క మహిళ కూడా ముందుకు రావడం లేదు కారణం ఏమిటో?' అని అడిగింది.

సుమంతుడు ' ఇది ఇంకా పురుషాధిక్య సమాజమే! తమ కన్నా ఇంట్లో ఉన్న మహిళలు ఉన్నత స్థానంలో ఉద్యోగం చేయడానికి ఒప్పుకోరు మహారాణి. విద్య కూడా బాలురకు మాత్రమే పరిమితమై ఉంది. బాలిక విద్యా అందిస్తున్నప్పటికీ ఎవరు కూడా పాఠశాలలో బాలికలను పంపించడం లేదు. మరి మార్పు ఎలా వస్తోంది' అని అన్నాడు.

మహిళా వివక్ష రూపు మాపి, రాజ్యంలో బాలికలందరూ చదువుకునే చర్యలు చేపట్టాలని మిత్ర వాణి అనుకుంది. బాలికల కోసం ప్రత్యేకమైన పాఠశాలలు స్థాపించాలని ఆజ్ఞ జారీ చేసింది. బాలికలను పాఠశాలలకు పంపిస్తే వారి పన్నులు తొలగించేలా చర్యలు చేపట్టింది. మిత్ర వాణి ఆలోచనను మంత్రి సుమంతుడు మెచ్చుకున్నాడు. రాజ్యంలో బాలికలందరూ పాఠశాలకు వెళ్ళడం మొదలు పెట్టారు. బాలురతో పోటీగా బాలికలు రాణించసాగారు. కొన్నాళ్లకు మహిళలకు ఆస్థానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించి, రాజ్య పాలన మరింత అభివృద్ధి పథంలో సాగింది.

- మొర్రి గోపి
88978 82202



లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 78

నేను గీసిన బొమ్మ



- ఎన్. యోగ నితీష్,
3వ తరగతి,
జెడ్.పి. హైస్కూలు,
గుమ్మలక్ష్మిపురం,
మన్యం జిల్లా.



ఉత్కంఠ పోరులో పంజాబ్‌దే గెలుపు

ప్రభుసిమ్రాన్ అర్ధసెంచరీ.. రాజస్తాన్‌పై ఐదు పరుగుల తేడాతో గెలుపు

సంజు, హెట్‌మెయిర్ పోరాటం వృథా

గౌహతి: చివరి బంతి వరకు నువ్వా-నేనా అన్నట్లు సాగిన మ్యాచ్‌లో అంతిమ విజయం పంజాబ్ కింగ్స్‌ను వరించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 197 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో రాజస్తాన్ జట్టు చివరి వరకు పోరాడి 7వికెట్లు కోల్పోయి 192పరుగులే ఓటమిపాలైంది. చివరి ఓవర్లో రాజస్తాన్ గెలుపుకు 17పరుగులు చేయాల్సి రాగా.. 11 పరుగులే చేసింది. దీంతో పంజాబ్ జట్టు 5పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకోగా.. రాజస్తాన్ అభిమానులు నిరాశకు గురయ్యారు. తొలుత పంజాబ్ కింగ్స్ కెప్టెన్ ధావన్-ప్రభ్‌సిమ్రన్ కలిసి తొలి వికెట్‌కు 90పరుగులు జతచేశారు. పంజాబ్ కింగ్స్ జట్టు ఆట ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్ ప్రభ్ సిమ్రన్ సింగ్ (60; 34బంతుల్లో, 7ఫోర్లు, 3సిక్సర్లు) చెలరేగి ఆడాడు. మరో ఎండ్‌లో కెప్టెన్ శిఖర్ ధావన్ (86నాటౌట్; 56బంతుల్లో, 9ఫోర్లు, 3సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. వీరిద్దరికి తోడు మిడిలార్డర్ బ్యాటర్ జితేశ్ శర్మ(27) బ్యాటింగ్‌లో రాణించాడు. హోల్డర్‌కు రెండు, అశ్విన్, చాహల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో రాజస్తాన్ జట్టుకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు జైస్వాల్, అశ్విన్ ఘోరంగా విఫలమయ్యారు. ఆ తర్వాత స్టార్ బ్యాటర్ బట్లర్‌కు కూడా త్వరగా పెవీలియన్‌కు చేరడంతో రాజస్తాన్ జట్టు 57పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో కెప్టెన్ సంజు(42), దేవదత్ పటిధర్(21)కి రాజస్తాన్ ఇన్నింగ్స్‌ను కుదుటపరిచారు. చివర్లో రియాన్ పరాగ్(20), హెట్‌మేయర్(36) ఆకాశమే హద్దుగా చెలరేగి విజయావకాశాలపై ఆశలు రేపారు. ఈ క్రమంలో హెట్‌మెయర్ ఔటవ్వడంతో రాజస్తాన్ ఆశలు అడియాశలయ్యాయి. ఎల్లిస్‌కు నాలుగు, ఆర్ష్‌దీప్ సింగ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఎల్లిస్‌కు లభించింది.

రాజపక్సకు గాయం..

శ్రీలంక విధ్వంసక ఆటగాడు బానుక రాజపక్స్ గాయపడి రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. అశ్విన్ బౌలింగ్‌లో కెప్టెన్ శిఖర్ ధావన్ కొట్టిన స్ట్రెయిట్ షాట్ రాజపక్స మోచేతికి బలంగా తాకింది. దీంతో నొప్పితో రాజపక్స విలవిల్లాడిపోయాడు. ఇన్నింగ్స్ 11వ ఓవర్ తొలి బంతికి ఇది చోటుచేసుకుంది. ఫిజియో వచ్చి రాజపక్సను పరిశీలించగా.. బ్యాట్ పట్టుకోవడం కష్టంగా మారింది. దీంతో రాజపక్స రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది.

స్కోర్‌బోర్డు..

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి)బట్లర్ (బి)హోల్డర్ 60, ధావన్ (నాటౌట్) 86, రాజపక్సా(రిటైర్డ్‌హార్ట్) 1, జితేశ్ శర్మ (సి)రియాన్ పరాగ్ (బి)చాహల్ 27, సికిందర్ రాజా (బి)అశ్విన్ 1, షారుక్ ఖాన్ (సి)బట్లర్ (బి)హోల్డర్ 11, శామ్ కర్రన్ (నాటౌట్) 1, అదనం 10. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 197పరుగులు. **వికెట్ల పతనం:** 1/90, 2/158, 3/159, 4/195 **బౌలింగ్:** బౌల్ట్ 4-0-38-0, ఆసిఫ్ 4-0-54-0, అశ్విన్ 4-0-25-1, హోల్డర్ 4-0-29-2, చాహల్ 4-0-50-1

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)షార్ట్ (బి)ఆర్ష్‌దీప్ 11, అశ్విన్ (సి)ధావన్ (బి)ఆర్ష్‌దీప్ 0, బట్లర్ (సి అండ్ బి) ఎల్లిస్ 19, సంజు (సి)షార్ట్ (బి)ఎల్లిస్ 42, దేవదత్ పటీధర్ (బి) ఎల్లిస్ 21, రియాన్ పరాగ్ (సి)షారుక్ ఖాన్ (బి)ఎల్లిస్ 20, హెట్‌మెయిర్ (రనౌట్) షారుక్/శామ్ కర్రన్ 36, జోరెల్ (నాటౌట్) 32, హోల్డర్ (నాటౌట్) 1, అదనం 10. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 192పరుగులు. **వికెట్ల పతనం:** 1/13, 2/26, 3/57, 4/91, 5/121, 6/124, 7/186 **బౌలింగ్:** శామ్ కర్రన్ 4-0-44-0, ఆర్ష్‌దీప్ 4-0-47-2, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-15-0, ఎల్లిస్ 4-0-30-4, రాహుల్ చాహర్ 4-0-31-0, సికిందర్ రాజా 2-0-24-0


ఎల్లిస్‌ను అభినందిస్తున్న పంజాబ్ ఆటగాళ్లు

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	2	2	0	4	+0.70
పంజాబ్	2	2	0	4	+0.31
బెంగళూరు	1	1	0	2	+1.98
రాజస్తాన్	2	1	1	2	+1.67
లక్నో	2	1	1	2	+0.95
చెన్నై	2	1	1	2	+0.03
కోల్‌కతా	1	0	1	0	-0.43
ముంబయి	1	0	1	0	-1.98
ఢిల్లీ	2	0	2	0	-1.70
హైదరాబాద్	1	0	1	0	-3.60

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు..

కోల్‌కతా × బెంగళూరు
(వేదిక: కోల్‌కతా; రా.7.30గం॥లకు)

మిథున్, రాజవత్ ముందుకు

తొలిరౌండ్‌లోనే ఓడిన సైనా, సాయిప్రణీత్, సమీర్ వర్మ



ఓర్లీన్స్(ఫ్రాన్స్): ఓర్లీన్స్ మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్లు మిథున్ మంజునాథ్, ప్రియాంశు రాజవత్ శుభారంభం చేయగా.. స్టార్ షట్లర్లు బి. సాయిప్రణీత్, సమీర్‌వర్మ తొలిరౌండ్‌లోనే ఓటమిపాలయ్యారు. అలాగే మహిళల సింగిల్స్‌లో లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ నిరాశపరిచింది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో మిథున్ 24-22, 25-23తో విక్టర్ సెవెండ్సెన్(డెన్మార్క్)పై, ప్రియాంశురాజవత్ 21-18, 21-13తో కిరణ్ జార్జి(భారత్)పై గెలుపొందగా.. సమీర్ వర్మ 19-21, 21-19, 17-21తో నుయేన్(వియత్నాం) చేతిలో, బి. సాయి ప్రణీత్ 20-22, 17-21తో లింగ్-జన్-హో(అమెరికా) చేతిలో ఓడారు. ఇక మహిళల సింగిల్స్‌లో తాన్యా హేమంత్ 21-17, 21-18తో హెట్(ఫ్రాన్స్)ను ఓడించగా రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లినా.. స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ 16-21, 14-21తో నెస్లన్ హెట్(టర్కీ) చేతిలో వరుససెట్లలో ఓటమిపాలైంది. మరో ఉత్కంఠ పోటీలో తస్మిన్ మీర్ 22-20, 13-21, 5-21తో యొన్నె లీ(జర్మనీ) చేతిలో, ఆకర్షి కశ్యప్ 8-21, 21-13, 8-21తో నిడైర్యా(జపాన్) చేతిలో పోరాడి ఓడారు.

వెటరన్ క్రికెటర్ సుధీర్ నాయక్ కన్నుమూత



ముంబయి: టీమిండియా వెటరన్ క్రికెటర్, ఓపెనర్ సుధీర్ నాయక్(78) బుధవారం కన్ను మూశారు. 1974-75 మధ్య కాలంలో భారత్ తరపున మూడు టెస్టులు, రెండు వన్డేలు ఆడిన నాయక్.. దాదర్‌లోని తన నివాసంలో కాలుజారి పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. అపస్మారకస్థితిలో ఉన్న నాయక్‌ను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ కన్నుమూశారు. ముంబయి జట్టు 1970-71లో రంజీట్రోఫీ గెలిచిన జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ముంబయి తరపున 85ఫస్ట్‌క్లాస్ మ్యాచులు ఆడిన నాయక్.. ఏడు సెంచరీలు, 27అర్ధసెంచరీలతో సహా మొత్తం 4,376పరుగులు చేశారు.

శుభ్‌మన్ @ 4

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) వన్డే బ్యాటర్స్ జాబితాలో టీమిండియా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ సత్తా చాటాడు. ఐసిసి బుధవారం విడుదల చేసిన పురుషుల బ్యాటర్స్ జాబితాలో శుభ్‌మన్ 738రేటింగ్ పాయింట్లతో కెరీర్ బెస్ట్ ర్యాంక్ 4వ స్థానంలో నిలిచాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68